# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 2 సంచిక : 22 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు ఆదివారం 27 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :22 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SUN 27 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## 10 శాతం వృద్ధి సాధ్యమే

### టెక్నాలజీపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పెట్టుబడులతోనే దేశానికి ఉజ్వల భవిష్యత్తు
- ఏఐ, సెమీకండక్టర్లకు భారీగా నిధులు కేటాయించాలని సూచన
- చిన్న పరిశ్రమల్లోనూ ఏఐ వాడకం పెరగాలని వ్యాఖ్య

- మిగతా 2లో

## పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి.. 11 మంది మృతి



- పాకిస్థాన్‌లో పోలీసు చెక్‌పోస్ట్‌పై ఆత్మాహుతి దాడి
- ఈ ఘటనలో 11 మంది మృతి, 30 మందికి గాయాలు
- పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వెల్లడి
- దాడికి బాధ్యత ప్రకటించుకున్న తెహ్రీక్-ఇ-తాలిబన్

- మిగతా 2లో



## కర్నూలులో ఏవియేషన్ అకాడమీ రావడం చరిత్రాత్మకం

- ఏవియేషన్ సెంటర్ ను ప్రారంభించిన ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ
- పైలట్లకు డిమాండ్ విపరీతంగా పెరుగుతుందన్న మంత్రి
- ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేయబోతున్నట్టు బీసీ జనార్దన్ ప్రకటన

- మిగతా 2లో



## సీఎం విజయ్ నటనను ఇంకా ఆపలేదు: స్టాలిన్

- సీఎం విజయ్‌పై మాజీ సీఎం స్టాలిన్ తీవ్ర విమర్శలు
- ప్రజల ముందు విజయ్ నటన ఇంకా కొనసాగుతోందని ఎద్దేవా
- డీఎంకే పథకాలకే పేర్లు మార్చి అమలు చేస్తున్నారని ఆరోపణ
- సీఎం పదవికి తగిన హుందాతనం చూపాలని హితవు

- మిగతా 2లో

# భారీ వర్షాలతో ఉత్తరాంధ్ర అతలాకుతలం..

## అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు

- భారీ వర్షాలు, వరద పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- వేటకు వెళ్లలేని మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం పంపిణీకి ఆదేశం
- ప్రకాశం బ్యారేజీకి ఎగువ, దిగువన కొత్త బ్యారేజీల నిర్మాణ ప్రతిపాదనలు
- తాజా వర్షాలతో రాష్ట్రంలోని జలాశయాల్లోకి 21 టీఎంసీల అదనపు నీరు
- రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గుదల



పెన్ పవర్ డెస్క్:గత కొద్దిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షాలు, వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, వేటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న మత్స్యకార కుటుంబాలకు తక్షణ సాయంగా 50 కేజీల బియ్యం అందించాలని ఆదేశించారు. అదే సమయంలో కృష్ణా నదిపై రెండు కొత్త బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను వేగవంతం చేయాలని అధికారులకు కీలక సూచనలు చేశారు.శనివారం జరిగిన ఈ సమీక్షలో అధికారులు రాష్ట్రంలోని తాజా పరిస్థితిని సీఎంకు వివరించారు. ఉత్తరాంధ్రలో నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయని, పలుచోట్ల నివాస ప్రాంతాలు, పంట పొలాలు నీట మునిగాయని తెలిపారు. సహాయక చర్యలపై ఆరా తీసిన ముఖ్యమంత్రి, ఎక్కడా ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని స్పష్టం చేశారు. ఐదు రోజులుగా సముద్రంలోకి వెళ్లలేని మత్స్యకారుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వారికి అండగా నిలవాలని, తక్షణమే బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు.

కృష్ణాపై కొత్త బ్యారేజీలు.. నీటి భద్రతపై దృష్టి

ఈ సందర్భంగా స్థానికంగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పెరుగుతోందని అధికారులు తెలపగా, ఆ నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేసుకునే మార్గాలపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పులిచింతల-ప్రకాశం బ్యారేజీ మధ్య ఒకటి, ప్రకాశం బ్యారేజీకి దిగువన మరొకటి చొప్పున రెండు కొత్త బ్యారేజీల నిర్మాణం అవసరమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి గతంలో రూపొందించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు. అలాగే, హిర మండలం లిఫ్ట్ ప్రాజెక్టుకు విద్యుత్ సౌకర్యం కల్పించి, వంశధార నీటిని రిజర్వాయర్‌లోకి తరలించే పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులకు సూచించారు.

- మిగతా 2లో

## ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది

- ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం
- ఢిల్లీలో కీలక సమావేశంతో క్లారిటీ ఇచ్చిన ఈసీ
- తమ మధ్య విభేదాలు లేవంటూ సంయుక్త ప్రకటన విడుదల
- సోషల్ మీడియాలో స్పందించిన ఏపీ సీఎం చంద్రబాబు
- రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను గౌరవించాలని పిలుపు
- గెలుపోటములను హుందాగా స్వీకరించడమే నాయకత్వ లక్షణమని ఉద్ఘాటన



పెన్ పవర్ డెస్క్:భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య విభేదాలు తలెత్తాయంటూ వచ్చిన వార్తలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఇవాళ ఓ కీలక సమావేశం సందర్భంగా ఈసీ ఇచ్చిన ఏకగ్రీవ ప్రకటనతో అన్ని అపోహలకు తెరపడిందని ఆయన పేర్కొన్నరు. మన రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను ఈ ప్రకటన మరోసారి స్పష్టం చేసిందని ఎక్స్ వేదికగా శనివారం ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై నెలకొన్న వివాదం

- మిగతా 2లో

## కాంగ్రెస్‌తో కలవాలనే ఉద్దేశంతోనే జగన్ వైఖరి మార్చుకుంటున్నారా?

- ఓటర్ల జాబితా సవరణపై జగన్ ది ద్వంద్వ వైఖరి అంటూ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఫైర్
- గతంలో కోర్టులో ఒకలా, ఇప్పుడు మరోలా మాట్లాడటమేంటని ప్రశ్న
- ఈసీల నియామకంపై మాట మార్చడం వెనుక ఆంతర్యమేమిటని నిలదీత
- 2029లో కాంగ్రెస్‌తో పొత్తు కోసమే జగన్ వ్యూహాలని ఆరోపణ

- మిగతా 2లో



## ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం..

### ప్రెస్ నోట్, గ్రూప్ ఫొటోతో చెక్ పెట్టిన ఈసీ

- ఈసీలో విభేదాల వార్తలను ఖండించిన పూర్తిస్థాయి కమిషన్
- నిర్ణయాలన్నీ ఏకగ్రీవమేనని స్పష్టం చేసిన ముగ్గురు కమిషనర్లు
- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించిందని వెల్లడి
- పనితీరును మెరుగుపర్చేందుకు అంతర్గత విధానాల్లో కీలక మార్పులు
- ఈసీఐనెట్ పోర్టల్‌పై సమీక్షకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు




పెన్ పవర్ డెస్క్:భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయంటూ గత కొద్ది రోజులుగా వస్తున్న వార్తలను కమిషన్ తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలకు తెరదించుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)

- మిగతా 2లో



## పరవాడ ఫార్మా కాలుష్యంపై పవన్ కల్యాణ్ సీరియస్..

### 95 కంపెనీలకు నోటీసులు

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఫార్మాసిటీపై పీసీబీ చర్యలు
- సోషల్ మీడియా ఫిర్యాదు ఆధారంగా కాలుష్యంపై తనిఖీలు
- పరవాడలోని 95 ఫార్మా పరిశ్రమలకు షోకాజ్ నోటీసులు జారీ
- వ్యర్థాల నిర్వహణపై పరిశ్రమలకు కీలక దిద్దుబాటు చర్యల ఆదేశం

- మిగతా 2లో

## ఏపీ, కర్ణాటక పెద్దల ఆజ్ఞలను పాటిస్తూ ఇక్కడి నాణ్యమైన బొగ్గును ఆ రాష్ట్రాలకు తరలిస్తున్నారు



- విద్యుత్ రంగాన్ని రేవంత్ ప్రభుత్వం నాశనం చేసిందన్న జగదీశ్ రెడ్డి
- వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి రేవంత్ డైవర్షన్ డ్రామాలు ఆడుతున్నారని విమర్శ
- విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని డిమాండ్

- మిగతా 2లో

## సీఈసీ రాజీనామా చేయాల్సిందే

### ఈసీ ప్రెస్ నోట్‌పై కాంగ్రెస్ ఫైర్

- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్
- ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని పట్టు
- కోట్లాది మంది ఓటర్ల హక్కును హరించే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- ఎన్నికల సంఘం ఇచ్చిన వివరణపై జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు
- యువతను లక్ష్యంగా చేసుకుని జాబితాల నుంచి పేర్లు తొలగిస్తున్నారని ధ్వజం

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

### వైసీపీ స్ట్రాటజీ వర్క్ అవుట్ అవుతుందా? అందుకే టీడీపీని టార్గెట్ చేసిందా?

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీ చుట్టూ జరుగుతున్న రాజకీయ పోరు తీవ్ర స్థాయికి చేరింది. ఈ అంశం వెనుక వైసీపీ రాజకీయ అస్త్రాలు, వ్యూహాలు ఉన్నాయనే విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా, విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ లక్ష్యంగా మరియు మిత్రపక్షాలైన టీడీపీ–బీజేపీ–జనసేన మధ్య సమతుల్యతను దెబ్బతీసే విధంగా ఈ వివాదాన్ని సజీవంగా ఉంచేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నారా లోకేశ్ లక్ష్యంగా వ్యూహంకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి నియామక ప్రక్రియను వేగవంతం చేసింది. అయితే, నియామకాలు పూర్తయిన తర్వాత ఈ ప్రక్రియలో, ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా, పేపర్ లీకేజీ మరియు టెట్ అర్హతలలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ ఆరోపిస్తోంది. గవర్నర్ కు కూడా ఫిర్యాదు చేశారు. ఎన్ని కేసులు పెట్టినా యుద్ధం ఆగదని జగన్ స్పష్టం చేయడంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎదుట టీడీపీని పలుచన చేయాలని భావిస్తున్నట్లుంది.

**లోకేశ్ ను టార్గెట్ చేయడం ద్వారా...**

విద్యా శాఖకు మంత్రిగా ఉన్న నారా లోకేశ్ ను నేరుగా టార్గెట్ చేయడం ద్వారా ఆయన రాజకీయ ప్రతిష్టను దెబ్బతీయడం వైసీపీ ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది. ఈ వ్యవహారంపై లోకేష్ రాజీనామా చేయాలని, సీబీఐ దర్యాప్తు జరిపించాలని జగన్ మోహన్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. బీజేపీ ఎదుట టీడీపీని పలుచన చేసే వ్యూహమా? రాజకీయ విశ్లేషకుల ప్రకారం, వైసీపీ ఈ అంశాన్ని ఇంత పెద్ద ఎత్తున లేవనెత్తడం వెనుక కేంద్రంలో ఉన్న బీజేపీ పెద్దల దృష్టిని ఆకర్షించే వ్యూహం కూడా ఉండవచ్చు. పరిపాలనా లోపాలను ఎత్తిచూపడంతో అవినీతి రహిత, పారదర్శక పాలన అందిస్తామని కేంద్రానికి హామీ టీడీపీ ఇచ్చింది. రాష్ట్రంలో మొదటి పెద్ద రిక్రూట్‌మెంట్‌లోనే అక్రమాలకు పాల్పడిందనే ఇంప్రెషన్‌ను బీజేపీ హైకమాండ్ ముందు ఉంచాలని వైసీపీ భావిస్తుండవచ్చు. అందుకే మెగా డీఎస్సీని వదలకుండా పట్టుకుని బీజేపీ దృష్టిలో లోకేశ్ ను పలుచన చేస్తే ఆ ప్రభావం కూటమిపై పడుతుందని వైసీపీ అంచనా వేస్తున్నట్లు అనిపిస్తుంది.

**కేంద్ర సంస్థల జోక్యం కోసం డిమాండ్...**

రాష్ట్ర దర్యాప్తు సంస్థలపై నమ్మకం లేదని, కేవలం సీబీఐ విచారణ ద్వారానే నిజాలు బయటపడతాయని జగన్ పదే పదే ట్వీట్లు మరియు ప్రెస్ మీట్ల ద్వారా ఒత్తిడి పెంచుతున్నారు. దీని ద్వారా కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య, ముఖ్యంగా టీడీపీ–బీజేపీ బంధంలో ఒక రకమైన ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టించవచ్చనేది విపక్షాల అంతర్గత అంచనాగా కనిపిస్తోంది. గత వైసీపీ హయాంలో సరైన ఉద్యోగ నోటిఫికేషన్లు రాలేదనే అసంతృప్తి నిరుద్యోగుల్లో ఉందనే విమర్శలను కౌంటర్ చేయడానికి ఈ అంశం ఉపయోగపడుతుందని వైసీపీ భావిస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటైన మెగా డీఎస్సీపై 'అక్రమాల మరక' వేయడం ద్వారా మైలేజ్ పొందాలని ప్రతిపక్షం భావిస్తోంది. నిరుద్యోగ యువతలో కూటమి ప్రభుత్వంపై నమ్మకాన్ని సడలించేలా ప్రచారం చేయడం కూడా ఇందులో భాగమే. వైసీపీ చేస్తున్న ఆరోపణలను అధికార టీడీపీ తీవ్రంగా ఖండిస్తోంది. ఇదంతా కేవలం "దుష్ప్రచార వ్యూహం" అని కొట్టిపారేస్తోంది. మరి బీజేపీ దృష్టిలో టీడీపీని పలుచన చేయాలన్న వైసీపీ వ్యూహం ఎంత మేరకు పలుచన చేస్తుందన్నది చూడాలి.

### ఏపీ, కర్ణాటక పెద్దల ఆజ్ఞలను పాటిస్తూ ఇక్కడి నాణ్యమైన బొగ్గును ఆ రాష్ట్రాలకు తరలిస్తున్నారు

కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇచ్చిన హామీల అమలులో రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమైందని, సాగు, తాగునీటితో పాటు విద్యుత్ రంగంలోనూ అరాచకం సృష్టిస్తోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఎప్పుడూ డైవర్షన్ డ్రామాలు ఆడుతుంటారని దుయ్యబట్టారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తిపై ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతోందని, ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారని సంచలన ఆరోపణలు చేశారు. ఏపీ, కర్ణాటక ప్రభుత్వాల పెద్దల ఆజ్ఞలను పాటిస్తూ ఇక్కడి నాణ్యమైన బొగ్గును ఆ రాష్ట్రాలకు తరలిస్తున్నారని దుయ్యబట్టారు. ఇక యాదాద్రి పవర్ ప్లాంట్‌పై కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, సిమెంట్ పరిశ్రమలకు అవసరమైన యాష్ (బూడిద) అవసరాలను దృష్టిలో ఉంచుకునే దాన్ని దామరచర్లలో ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. ఎండిపోతున్న పొలాలు సీఎం రోజువారీ డ్రామాలతో పండవని, ఇప్పటికైనా అనవసరపు పనులు మాని పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని డిమాండ్ చేశారు. పాలిచ్చే ఆవులాంటి ట్రాన్స్‌కోను తన సన్నిహితులకు కట్టబెట్టేందుకు సీఎం రేవంత్ కుట్ర పన్నుతున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. దేశంలో ఢిల్లీ, ముంబై, ఒడిశా వంటి ప్రాంతాల్లో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించిన చోట ప్రజలపై విపరీతమైన భారం పడిందని అన్నారు. కేసీఆర్ మీద ఎంత ఒత్తిడి ఉన్నా నాటి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేట్‌పరం చేయలేదని, కానీ ప్రస్తుత సర్కార్ మాత్రం కమీషన్లకు ఆశపడి ట్రాన్స్‌కో లక్షల కోట్ల ఆస్తులను కారుచౌకగా అమ్మేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ట్రాన్స్‌కో ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ప్రశ్నించిన అధికారులపై ఏసీబీ కేసుల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అనుసరించే ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ తీవ్రంగా పోరాడుతుందని హెచ్చరించారు. నాటి సీఎం కేసీఆర్ చొరవతోనే తెలంగాణ చీకట్ల నుంచి వెలుగులోకి వచ్చిందని కొనియాడారు. అసాధ్యమనుకున్న 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను కొన్ని నెలల వ్యవధిలోనే అన్ని వర్గాలకు అందించిన ఘనత బీఆర్ఎస్‌దేనని స్పష్టం చేశారు. కేవలం ట్రాన్స్‌కోపైనే రూ.36 వేల కోట్లు వెచ్చించి, ఎక్కడ విద్యుత్ సరఫరా నిలిచినా మరో మార్గం ద్వారా అనుసంధానించే అధునాతన గ్రిడ్ వ్యవస్థను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామని గుర్తుచేశారు.

### కర్నూలులో ఏవియేషన్ అకాడమీ రావడం చరిత్రాత్మకం

రాష్ట్రంలోనే ప్రప్రథమంగా కర్నూలు ఎయిర్‌పోర్టులో ఏవియేషన్ ట్రైనింగ్ సెంటర్ అందుబాటులోకి రావడం చరిత్రాత్మకమని రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కర్నూలు విమానాశ్రయం వేదికగా ఈరోజు 'ఓరియంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ' ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ సిరి, స్థానిక ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, కేఈ శ్యామ్ బాబుతో పాటు అకాడమీ చైర్మన్ ఆనంద్ జాకబ్ వర్గీస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భవిష్యత్ ప్రణాళికలపై మాట్లాడిన మంత్రి జనార్దన్ రెడ్డి... ఓర్వకల్లులో అత్యాధునిక హంగులతో 'డ్రోన్ సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. దీన్ని రెండు దశలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. తొలి విడతలో 180 ఎకరాల్లో, ఆ తర్వాత రెండో దశలో మరో 400 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. గతంలో 2017లో కర్నూలు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి పునాదిరాయి వేసి, అతి తక్కువ కాలంలోనే దానిని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేశామని జనార్దన్ రెడ్డి గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో ఏవియేషన్ సెక్టార్‌లో ప్రొఫెషనల్స్, పైలట్లకు డిమాండ్ విపరీతంగా పెరగనుందని తెలిపారు. ఈ కొత్త ట్రైనింగ్ సెంటర్ ద్వారా కర్నూలు జిల్లా యువతతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు విమానయాన రంగంలో నిపుణులుగా శిక్షణ పొందే సువర్ణావకాశం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది

- మొదటి పేజి తరువాయి

తాజాగా ఈసీ వివరణతో ముగిసిందని తెలిపారు. స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయని, బలమైన ప్రజాస్వామ్యంలో గెలుపును, ఓటమిని సమానంగా, హుందాగా స్వీకరించడమే నిజమైన నాయకత్వ లక్షణమని హితవు పలికారు. రాజ్యాంగ సంస్థలను గౌరవించడం అత్యంత ముఖ్యమని, భారత ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం పార్టీలకు అతీతంగా నాయకులందరి ఉమ్మడి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు.

**సంయుక్త ప్రకటనతో వివాదానికి ముగింపు**

కాగా, గత కొద్ది రోజులుగా తమ మధ్య తీవ్ర విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న ఊహాగానాలకు భారత ఎన్నికల సంఘం పూర్తిస్థాయి కమిషన్ శనివారం తెరదించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న ఫోటోతో పాటు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా సవరణ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

**వివాదానికి నేపథ్యం ఇదే..**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ సెప్టెంబర్ 23న ఓ ప్రముఖ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించి, తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేసింది.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో పేర్కొంది. ఆ తర్వాత కార్యక్రమ షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది. నిర్ణయాలన్నీ సమష్టిగా, సంస్థాగత విధివిధానాలను అనుసరించే తీసుకుంటామని కమిషన్ స్పష్టం చేసింది.

## కాంగ్రెస్‌తో కలవాలనే ఉద్దేశంతోనే జగన్ వైఖరి మార్చుకుంటున్నారా?

వైసీపీ అధినేత జగన్ పై టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్‌ది అవకాశవాద, ద్వంద్వ వైఖరి అని ఆరోపిస్తూ సోషల్ మీడియా వేదికగా పలు కీలక ప్రశ్నలు సంధించారు. ఆయన రాజకీయ సౌలభ్యం కోసం వైఖరులు మార్చుకుంటున్నారని ఘాటుగా విమర్శించారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఇప్పుడు ఆరోపణలు చేస్తున్న జగన్, గతంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇదే ప్రక్రియను ప్రామాణికంగా తీసుకున్నారని లావు గుర్తుచేశారు. "ఎస్ఐఆర్ పూర్తయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మీ పార్టీ ఎమ్మెల్సీ లెళ్ల అప్పిరెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం వాస్తవం కాదా? కోర్టులో ఒకలా, ఇప్పుడు మరోలా మాట్లాడటంలోని ఆంతర్యమేమిటి?" అని ఆయన ప్రశ్నించారు. అదేవిధంగా, ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగిస్తూ 2023లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టానికి వైసీపీ మద్దతు ఇచ్చిందని లావు పేర్కొన్నారు. కానీ ఇప్పుడు, ప్రధాని, ప్రతిపక్ష నేతతో పాటు సీజేఐ కూడా ప్యానెల్‌లో ఉండాలని జగన్ డిమాండ్ చేయడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఈ ఆకస్మిక మార్పుల వెనుక రాజకీయ వ్యూహం ఉందని లావు అనుమానం వ్యక్తం చేశారు. 2029 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, తన మాతృ సంస్థ అయిన కాంగ్రెస్‌తో రాజకీయంగా కలవాలనే ఉద్దేశంతోనే జగన్ ఇలా తన వైఖరిని మార్చుకుంటున్నారా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

## పరవాడ ఫార్మా కాలుష్యంపై పవన్ కల్యాణ్ సీరియస్.. 95 కంపెనీలకు నోటీసులు

సోషల్ మీడియాలో వచ్చిన ఒక ఫిర్యాదుపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణమే స్పందించారు. ఆయన ఆదేశాలతో అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని 95 పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. శుద్ధి చేయని వ్యర్థాలను వర్షపు నీటి కాలువల్లోకి విడుదల చేస్తూ కాలుష్యానికి కారణమవుతున్నారన్న ఆరోపణలపై ఈ చర్యలు తీసుకుంది. వివరాల్లోకి వెళితే, పరవాడ ఫార్మాసిటీ సమీపంలోని డ్రెయిన్లలో నల్లటి రంగులో, దుర్వాసనతో కూడిన నీరు ప్రవహిస్తున్నట్లు శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో పోస్ట్ అయింది. ఈ వీడియో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్లడంతో, వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన పీసీబీ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన పీసీబీ అధికారులు, వీడియోలో కనిపించిన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. నమూనాలను సేకరించి పరిశీలించగా, శుద్ధి చేయని వ్యర్థ జలాలు వర్షపు నీటి కాలువల్లోకి చేరుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీనికి బాధ్యులుగా ఫార్మాసిటీలోని మొత్తం 95 కంపెనీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

కేవలం నోటీసులు ఇవ్వడమే కాకుండా, కాలుష్య నివారణకు పలు కఠినమైన దిద్దుబాటు చర్యలను కూడా పీసీబీ తప్పనిసరి చేసింది. పరిశ్రమల ప్రాంగణంలోనే వర్షపు నీటిని నిల్వ చేయాలని, కలుషిత నీటిని బయటకు వదలరాదని స్పష్టం చేసింది. వ్యర్థాల నిర్వహణను డిజిటలైజ్ చేయాలని, తేదీ, సమయంతో సహా రికార్డ్ చేసే సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి ఫుటేజీని ఆరు నెలల పాటు భద్రపరచాలని సూచించింది. ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థతో కూడిన స్క్రబ్బర్లను వాడాలని, పర్యావరణ అనుమతుల నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశాల్లో పేర్కొంది. నిర్ణీత సమయంలో సంతృప్తికరమైన సమాధానం ఇవ్వని, అక్రమంగా వ్యర్థాలను విడుదల చేస్తున్నట్లు తేలిన పరిశ్రమలపై పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పీసీబీ హెచ్చరించింది. తీసుకున్న చర్యలపై ఒక సమగ్ర నివేదికను ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపినట్లు అధికారులు తెలిపారు.

## ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం..

- మొదటి పేజి తరువాయి

జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి శనివారం న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న గ్రూప్ ఫోటోతో పాటు ఒక సుదీర్ఘమైన ప్రెస్ నోట్‌ను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ూ×=), ఓటర్ల నమోదు ప్రక్రియ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలపై ఇందులో సమగ్రంగా వివరణ ఇచ్చారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారని సెప్టెంబర్ 23న ఓ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఆ తర్వాత ఈ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ప్రత్యేక సవరణ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది. కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం–6లో, దరఖాస్తుదారులు తమ తల్లిదండ్రుల పేర్ల ద్వారా గత సవరణతో తమ సంబంధాన్ని ధ్రువీకరించాలనే నిబంధనపై వస్తున్న విమర్శలపైనా కమిషన్ స్పందించింది. ఈ డిక్లరేషన్‌ను కూడా సుప్రీంకోర్టు సమర్థించిందని తెలిపింది. అయితే, ఈ నిబంధన కేవలం ప్రత్యేక సవరణ ప్రక్రియకు మాత్రమే వర్తిస్తుందని, మిగతా సమయాల్లో ఎలక్టర్ల నమోదు నిబంధనలు, 1960 ప్రకారం నిర్దేశించిన ఫారాలనే వాడతామని స్పష్టం చేసింది. గోవాలో 97 మంది ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోవడంపై కూడా ఈసీ వివరణ ఇచ్చింది. ఇంటింటి సర్వే నిర్వహించి, అవసరమైన ఫారాలను సేకరించాలని గోవా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ) సంబంధిత బూత్ లెవల్ అధికారులను ఆదేశించారని పేర్కొంది. ఇప్పటికే ఆ 97 మందిలో 81 మంది తమ పేర్లను చేర్చాలని కోరుతూ ఫారం–6 సమర్పించారని వెల్లడించింది.

ఇక, ఎలక్టోరల్ రోల్ డేటాబేస్‌కు యాక్సెస్ విషయంలో ఈసీఐనెట్ (జుజ×చీజు) పోర్టల్‌పై తలెత్తిన ఆందోళనలపైనా కమిషన్ స్పందించింది. క్షేత్రస్థాయి అధికారులకు వారి చట్టబద్ధమైన అధికారాలకు అనుగుణంగానే 'రోల్–బేస్డ్ యాక్సెస్' ఇస్తామని స్పష్టం చేసింది. ఈ పోర్టల్ పనితీరును సమీక్షించేందుకు ఓ సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందులో ఐఐటీ లేదా ట్రిపుల్ ఐటీకి చెందిన స్వతంత్ర నిపుణుడు కూడా ఉంటారని ప్రకటించింది. క్యాబినెట్ సెక్రటరీకి పంపిన లేఖ ఈసీ విధానపరమైన అంశాలకు సంబంధించింది కాదని, డిప్యుటేషన్‌పై ఉన్న ఓ అధికారి పని పునఃపంపిణీకి మాత్రమే సంబంధించిందని కమిషన్ స్పష్టం చేసింది.

అంతర్గత పనివిధానాలను మరింత బలోపేతం చేసేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు ఈసీ ప్రకటించింది. ఇకపై కమిషన్ సమావేశాల అజెండాలను సభ్యులకు ముందుగానే సర్క్యులేట్ చేయాలని, సమావేశం అనంతరం మినిట్స్ జారీ చేయాలని నిర్ణయించింది. కమిషనర్లు అధికారులకు జారీ చేసే ఆదేశాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. ఢిల్లీ, మహారాష్ట్రల్లో ప్రత్యేక సవరణ గడువును పొడిగిస్తున్నట్లు తెలిపింది. తమ ప్రధాన నిర్ణయాలన్నీ సమష్టిగా, ఏకగ్రీవంగానే తీసుకున్నామని కమిషన్ పునరుద్ఘాటించింది.

## సీఎం విజయ్ నటనను ఇంకా ఆపలేదు: స్టాలిన్

తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్‌పై మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సినిమాలకు స్వస్తి పలికినప్పటికీ, ప్రజల ముందు విజయ్ ఇంకా నటిస్తూనే ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ మేరకు శనివారం 'ఎక్స్' వేదికగా ఆయన ఒక పోస్ట్ చేశారు.

మధురాంతకం అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచారంలో విజయ్ నటనను తాను ప్రత్యక్షంగా చూశానని స్టాలిన్ పేర్కొన్నారు. డీఎంకేను ఒక దుష్టశక్తిగా, టీవీకేను పవిత్ర శక్తిగా విజయ్ అభివర్ణించడం హాస్యాస్పదమని విమర్శించారు. విజయ్ ప్రభుత్వ హయాంలో పరిపాలన పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో విద్యుత్ కోతలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, పాల కొరత, శాంతిభద్రతల క్షీణత వంటి సమస్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. గత డీఎంకే ప్రభుత్వ పథకాలకే పేర్లు మార్చి టీవీకే ప్రభుత్వం అమలు చేస్తోందని ఆయన మండిపడ్డారు. జెమ్ గ్రానైట్స్ ఛైర్మన్ ఆర్. వీరమణికి సంబంధించిన పోక్సో కేసులో డీఎంకేపై విజయ్ చేస్తున్న ఆరోపణలు కేవలం నిరాధారమని స్టాలిన్ కొట్టిపారేశారు. ఈ విషయంపై తాను ఇప్పటికే అసెంబ్లీలో స్పష్టమైన వివరణ ఇచ్చానని గుర్తుచేశారు. దర్యాప్తు దశలో ఉన్న అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవద్దని మద్రాస్ హైకోర్టు ఆదేశించినప్పటికీ, ఎన్నికల ప్రచారంలో విజయ్ పదేపదే ఈ అంశాన్ని ప్రస్తావించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రజల ముందు నటించడం మాని, ముఖ్యమంత్రి పదవికి ఉండాల్సిన రాజకీయ హుందాతనాన్ని ప్రదర్శించాలని విజయ్‌కు స్టాలిన్ హితవు పలికారు.

## భారీ వర్షాలతో ఉత్తరాంధ్ర అతలాకుతలం..

**నిండిన జలాశయాలు.. తగ్గిన వర్షపాతం లోటు**

తాజా వర్షాల వల్ల రాష్ట్రంలోని 29 ప్రధాన రిజర్వాయర్లలోకి భారీగా నీరు వచ్చి చేరినట్లు ఇరిగేషన్ అధికారులు సీఎంకు వివరించారు. సెప్టెంబర్ 23 నాటికి 101 టీఎంసీలుగా ఉన్న నీటి నిల్వ, కేవలం మూడు రోజుల్లో 21 టీఎంసీలు పెరిగి 122 టీఎంసీలకు చేరిందని తెలిపారు. ఒక్క ఉత్తరాంధ్రలోని 11 ప్రాజెక్టుల్లోనే సుమారు 5 టీఎంసీల నీరు అదనంగా చేరిందని వివరించారు. ఈ వర్షాల వల్ల రాష్ట్రంలో వర్షపాతం లోటు 50 శాతం నుంచి 31 శాతానికి తగ్గిందని అధికారులు తెలిపారు.

గోదావరిపై ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రవాహం 1.20 లక్షల క్యూసెక్కుల నుంచి 3.50 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. వంశధారపై గొట్టా బ్యారేజీకి, నాగావళిపై నారాయణపురం ఆనకట్టకు కూడా ఇన్‌ఫ్లో రికార్డు స్థాయిలో పెరిగింది. పెరిగిన ప్రవాహాలను సద్వినియోగం చేసుకుని రిజర్వాయర్లతో పాటు చిన్న, మధ్య తరహా నీటి వనరులను కూడా నింపాలని సీఎం ఆదేశించారు. వరద తగ్గుముఖం పట్టినా, ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 10 శాతం వృద్ధి సాధ్యమే

దేశ ఆర్థిక వృద్ధి రేటు 10 శాతం మార్కును అధిగమించాలంటే అన్ని రంగాల్లోనూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్ సాంకేతిక విభాగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టడం ద్వారానే దేశం అభివృద్ధి పథంలో దూసుకెళుతుందని ఆమె స్పష్టం చేశారు. బెంగళూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. సాంకేతికత ఆధారంగా వివిధ రంగాల్లో మరిన్ని అంకుర సంస్థలు ఆవిర్భవించాలని ఆమె పిలుపునిచ్చారు. నూతన సాంకేతికతలను ప్రజలు సులభంగా అందిపుచ్చుకునేలా నైపుణ్యాభివృద్ధి, శిక్షణా కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేవలం దిగ్గజ సంస్థలకే పరిమితం కాకుండా, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో (ఎంఎస్ఎంఈ) సైతం ఏఐ వినియోగం గణనీయంగా పెరగాలని ఆమె ఆకాంక్షించారు. దేశ మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థికాభివృద్ధిలో తదుపరి దశకు చేరుకోవాలంటే అన్ని విభాగాల్లోనూ డిజిటల్ వ్యవస్థలకు పెద్దపీట వేయాలని నిర్మలా సీతారామన్ వివరించారు. ఈ ఆధునిక సాంకేతిక రంగాలకు తగిన ప్రోత్సాహం అందిస్తే, దేశ భవిష్యత్తును మరింత ఉజ్వలంగా తీర్చిదిద్దవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు.

## సీఈసీ రాజీనామా చేయాల్సిందే

భారత ఎన్నికల సంఘం ) తీరుపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఆయనపై విచారణ జరపాలని డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితా సవరణ పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్ల పేర్లను తొలగించే భారీ కుట్ర జరుగుతోందని ఆరోపించింది. ఈ సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ శనివారం గట్టిగా పట్టుబట్టింది. ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయంటూ మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో, ఈసీఐ నేడు ఓ ప్రెస్ నోట్ విడుదల చేసింది. ఈ వివరణ కాంగ్రెస్ ఆగ్రహాన్ని మరింత పెంచింది. ఈసీఐ ఇప్పుడు ఆత్మరక్షణలో పడిందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ జైరాం రమేశ్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా వరుస పోస్టులతో ఈసీఐని, సీఈసీని లక్ష్యంగా చేసుకుని పలు ప్రశ్నలు సంధించారు. "మీడియా కథనాల్లో వచ్చిన ఆరోపణలను ఈసీఐ తన ప్రెస్ నోట్‌లో ఎక్కడా నేరుగా ఖండించలేదు. వాటి తీవ్రతను తగ్గించే ప్రయత్నం మాత్రమే చేసింది. గోవా విషయంలో తప్పు చేసి దొరికిపోయాక, తొలగించిన 97 మందిలో 81 మంది పేర్లను తిరిగి చేర్చామని సిగ్గులేకుండా చెబుతోంది. అంటే, మొదట ఓటర్ల హక్కును కాలరాసి, దొరికిపోయాక మళ్లీ వారి పేర్లను చేర్చుతున్నామని చెప్పడం ఎంతవరకు సమంజసం?" అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. ఢిల్లీ, మహారాష్ట్రల్లో ఓటరు నమోదు గడువును పొడిగించిన ఈసీఐ.. కర్ణాటక, తెలంగాణ, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అన్యాయంగా ఓటు హక్కు కోల్పోయిన వారి పరిస్థితి ఏంటని నిలదీశారు. కేవలం ఒక వ్యక్తి అవినీతి వల్ల ఓటు హక్కు కోల్పోయిన ఈ రాష్ట్రాల ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఈసీఐకి లేదా అని ఆయన అన్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఐఐటీ/ట్రిపుల్ ఐటీ నిపుణులతో ఈసీనెట్ పోర్టల్‌ను సమీక్షిస్తామని చెప్పడం, సమస్య ఉందని అంగీకరించడమేనని జైరాం రమేశ్ పేర్కొన్నారు. సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు, ప్రతిపక్షాలపై ద్వేషం, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం, ముఖ్యంగా యువ ఓటర్లను (జెన్జ ) లక్ష్యంగా చేసుకోవడం వంటి అంశాలు ఆయన అవినీతిని బయటపెట్టాయని ఆరోపించారు. ఫారం 6లో పార్లమెంటు ఆమోదం లేకుండా మార్పులు చేసి, యువత ఓటు నమోదు చేసుకోకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. సీఈసీ బ్యూరోక్రసీ ముసుగులో దాక్కోవాలని చూస్తున్నారని, కానీ ఆయన బండారం బట్టబయలైందని జైరాం రమేశ్ అన్నారు. దేశమంతా ఆయనను జవాబుదారీ చేయాలని చూస్తోందని, ఈ నేపథ్యంలో సీఈసీ రాజీనామా లేదా ఆయనపై విచారణ జరపడం మినహా మరో మార్గం లేదని స్పష్టం చేశారు.

## పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి.. 11 మంది మృతి

పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు మరోసారి మారణహోమం సృష్టించారు. వాయవ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో శనివారం చోటుచేసుకున్న ఆత్మాహుతి దాడిలో కనీసం 11 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలోని ఒక రహదారి పక్కన ఉన్న పోలీసు చెక్‌పోస్ట్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగింది. పేలుడు పదార్థాలతో నింపిన వాహనంతో వచ్చిన ఆత్మాహుతి బాంబర్, చెక్‌పోస్ట్ సమీపంలోకి రాగానే తనను తాను పేల్చుకున్నాడు. ఈ పేలుడు ధాటికి ఆ ప్రాంతం ఒక్కసారిగా దద్దరిల్లింది. ఈ ఘటనలో భారీ స్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఈ ఘాతుకానికి తమదే బాధ్యతని పాకిస్థానీ తాలిబన్‌గా పిలిచే తెహ్రీక్–ఇ–తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ప్రకటించింది. ఇటీవలి కాలంలో పాకిస్థాన్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు గణనీయంగా పెరిగాయి. ప్రధానంగా టీటీపీ, బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) వంటి వేర్పాటువాద సంస్థలు వరుస దాడులకు పాల్పడుతున్నాయి. ఈ తాజా ఘటనతో దేశంలోని భద్రతా వ్యవస్థలోని లోపాలపై మరోసారి తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# ఆర్ఆర్ కాలనీలను శరవేగంగా అభివృద్ధి చేస్తాం

### కలెక్టర్ విజయ సునీత,ఎమ్మెల్యే కందుల

**మార్కాపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 26**

వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుల ఆర్ఆర్ కాలనీలను శరవేగంగా అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత,మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి తెలిపారు. మార్కాపురం కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాల్ లో వెలిగొండ నిర్వాసితుల ఆర్ఆర్ కాలనీల సమస్యలు, అభివృద్ధి పనులపై శనివారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ సునీత మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. కాలనీల్లో తాగునీరు, రోడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక ఇవ్వాలని ఆదేశించామని తెలిపారు. ఎమ్మెల్యే కందుల




నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి నిర్వాసితునికి న్యాయం చేస్తామని ,ఆర్ఆర్ కాలనీల సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నామని, కాలనీల్లో మౌలిక వసతులు కల్పించి శరవేగంగా అభివృద్ధి చేస్తామని అన్నారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# సీఎం పర్యటనను సక్సెస్ చేయండి

### -మాజీమంత్రి దేవినేని, ఎమ్మెల్యే ఇంటూరి పిలుపు
### -కందుకూరులో పార్టీ శ్రేణులతో సమావేశం
### -నియోజకవర్గం నుంచి 10వేల మంది తరలి వెళ్లేలా ఏర్పాట్లు










**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 26:**

ఈనెల 29వ తేదీన ఉదయగిరి నియోజకవర్గంలో జరగబోయే పల్లె పండుగ 3.0 ప్రారంభం కార్యక్రమంలో కందుకూరు నియోజకవర్గం నుంచి పదివేల మందికి పైగా తరలివెళ్లి జయప్రదం చేయాలని టిడిపి సీనియర్ నాయకులు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సీఎం సభను విజయవంతం చేసేందుకు, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గస్థాయి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. పరిశీలకుడిగా నియమితులైన దేవినేని ఉమామహేశ్వరరావు సమావేశంలో పాల్గొన్నారు. ముందుగా స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. దేవినేని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పల్లె పండుగ - 1,2 ద్వారా గ్రామాల్లో వందల కోట్ల రూపాయలతో సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలు జరిగాయన్నారు. మూడోవిడత కార్యక్రమాన్ని, ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం రామాపురంలో సీఎం చంద్రబాబు 29వ తేదీన లాంఛనంగా ప్రారంభిస్తారని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పాల్గొంటారని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడమే గాక, దానిని పూర్తి చేసి, జాతికి అంకితం చేసిన అపర భగీరధుడు చంద్రబాబు అని ఉమామహేశ్వరరావు కొనియాడారు. దానిద్వారా మార్కాపురం, ప్రకాశం జిల్లాలు సస్యశ్యామలం కాబోతున్నాయని చెప్పారు. పట్టిసీమ ప్రాజెక్టుతో కొన్నివేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. పోలవరం సహా రాష్ట్రంలో ఇంకా అనేక ప్రాజెక్టులను పూర్తి చేసి, ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని దేవినేని వెల్లడించారు. అంత కష్టపడి పూర్తిచేసిన వెలిగొండ ప్రాజెక్టును ప్రతి ఒక్కరూ చూసి రావాలని ఆయన సూచించారు. గొట్టిపాటి కొండప నాయుడు కాలువ పనులను పూర్తిచేసి, కందుకూరు ప్రాంతంలో రాళ్లపాడు రిజర్వాయరుకు సోమశిల ప్రాజెక్టు నుంచి నీరు తీసుకొచ్చిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదని అన్నారు. కందుకూరు మున్సిపాలిటీకి ఎన్నికలు జరగకుండా అడ్డుకుంటున్నారు. కోర్టులో కేసులు వేయించారు. వందల కోట్ల నిధులు ఆగిపోవడానికి వైసిపి నేతలుకారణం కాదా ? ఏ మొహం పెట్టుకొని మళ్ళీ జనాల్లోకి వెళతారు ? స్థానిక సంస్థలు ఎన్నికల్లో వాళ్లకు బుద్ధి చెప్పాలి. చిత్తుగా ఓడించాలి అని ఉమామహేశ్వరరావు కోరారు.2019-24 మధ్య గొడ్డలిపార్టీ చేసిన విధ్వంసం ఎవరైనా మరిచిపోతారా ? జనం చీకొట్టినా వాళ్లు మారలేదు. డీఎస్సీపై వందల పిటిషన్లు వేస్తే కోర్టు కొట్టేసింది. టీచర్లపై దాడులు చేస్తున్నారు. ఇదేం సంస్కృతి ? అని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అభివృద్ధి వేగంగా జరుగుతోంది. 20 సంవత్సరాల తర్వాత ఇక్కడ జెండా ఎగరేసిన సత్తా ఆయనది. కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే, స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలుచుకుంటారన్న నమ్మకం కనిపిస్తోంది. మళ్లీ విజయోత్సవ సభకు తప్పకుండా వస్తా అని నేతలు, కార్యకర్తల్లో దేవినేని ఉమామహేశ్వరరావు ఉత్తేజం నింపారు.ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి మండలం నుంచి భారీ సంఖ్యలో మూడు పార్టీల నేతలు, కార్యకర్తలు తరలిరావాలి. ప్రతి నాయకుడు జన సమీకరణ చేయాలి. సభకు బయలుదేరి వెళ్లి, తిరిగి వచ్చేంతవరకు బాధ్యత తీసుకోవాలి. పట్టణంతోపాటు ఐదు మండలాల నుంచి పదివేల మందికి పైగా తరలి రావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధిని ప్రజలందరూ చూస్తున్నారు. కందుకూరు రూపురేఖలు మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారం ఎంతో ఉంది. రాబోయే రోజుల్లో కందుకూరు ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి కాబోతోంది. మంచి మనసుతో వందల కోట్ల నిధులు ఇస్తున్నారు. దేవినేని ఉమామహేశ్వరరావు లాంటి సీనియర్ల సలహాలు తీసుకుంటూ ముందుకు వెళుతున్నాను. మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలి. ప్రభుత్వ పెద్దలందరూ పాల్గొనే సభను జయప్రదం చేయాలని కోరుతున్నాను అని నాగేశ్వరరావు అన్నారు. నియోజకవర్గ పరిశీలకురాలు ఎం. శ్రావణి రెడ్డి మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. చంద్రబాబు లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చి రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తున్నారు. యువతకు ఉద్యోగాలు వస్తున్నాయి. మహిళల ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. సీఎం కార్యక్రమాన్ని అందరూ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాయపాటి సుభాషిని శ్రీనివాసరావు, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీల అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, జనిగర్ల నాగరాజు, పూరిమిట్ల గురునాథం, మాదాల లక్ష్మీనరసింహం, మండలాల పరిశీలకులు పోకూరి రవీంద్రబాబు, చదలవాడ చంద్రశేఖర్, తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, కంద్రా మాల్యాద్రి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీను, అల్లం వెంకటేశ్వర్లు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కల్లూరి శైలజ ఇంకా పలువురు నాయకులు, అనుబంధ సంఘాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### భార్యపై అనుమానంతో
# అత్త, భార్య హత్య

### కత్తితో దాడి.. ఇద్దరూ మృతి.. నిందితుడు పోలీసుల అదుపులో





**సంతమాగులూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 26**

భార్యపై అనుమానంతో దాడి సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామంలోని జగనన్న కాలనీలో భార్యపై అనుమానంతో మీసరగండి వసంతరాయుడు తన తమ్ముడు అనిల్ తో కలిసి భార్య వీరనారాయణమ్మ (30), అత్త చిలకపాటి బ్రహ్మేశ్వరి (50)పై కత్తితో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో బ్రహ్మేశ్వరి అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన వీరనారాయణమ్మ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది.

**హుటాహుటిన చేరుకున్న సీఐ**

ఘటన సమాచారం అందుకున్న వెంటనే సంతమాగులూరు సీఐ పి.శేషగిరిరావు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో దర్శి డీఎస్పీ బాలమురళీకృష్ణ అక్కడికి చేరుకుని ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. తీవ్రంగా గాయపడిన వీరనారాయణమ్మను 108 వాహనంలో ఆసుపత్రికి తరలించేలా సీఐ చర్యలు చేపట్టారు.

**శాంతిభద్రతలపై పోలీసుల అప్రమత్తత**

ఘటన నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు చోటుచేసుకోకుండా ఎస్సై నాగరాజు, ఏఎస్ఐ పి.శ్రీనివాసరావు, సంతమాగులూరు పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని శాంతిభద్రతలను పర్యవేక్షించారు. డీఎస్పీ బాలమురళీకృష్ణ, సీఐ శేషగిరిరావు, ఎస్సై నాగరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

**మృతదేహాలకు పోస్టుమార్టం**

ఘటనా స్థలంలోనే మృతి చెందిన చిలకపాటి బ్రహ్మేశ్వరికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ శేషగిరిరావు తెలిపారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందిన వీరనారాయణమ్మకు కూడా పంచనామా, పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు చెప్పారు.

**భర్త ఫిర్యాదుతో కేసు నమోదు -మృతురాలు చిలకపాటి ..:** బ్రహ్మేశ్వరి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. భార్యకు ఏల్చూరుకు చెందిన తోట బ్రహ్మయ్యతో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతోనే వసంతరాయుడు దాడికి పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.

**నిందితుడు అదుపులో.. మరో వ్యక్తి పాత్రపై విచారణ..:** ఘటన అనంతరం వసంతరాయుడిని ఏల్చూరు గ్రామంలోని కెనరా బ్యాంకు సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడిగా పేర్కొన్న అనిల్ పాత్రపైనా పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. హత్యకు దారితీసిన పరిస్థితులు, నిందితుల పాత్ర, దాడికి ఉపయోగించిన ఆయుధం తదితర అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

# ఇంట్లోఅద్దెకు ఉన్న వ్యక్తే దోపిడీ

### సినీ ఫక్కీలో దోపిడీ -ఇంటి యజమానికి మత్తు డ్రిక్స్ త్రాపి దోపిడీ
### చేతికి ఉన్న నాలుగు బంగారు గాజులతో ఉడాయించిన దొంగ





**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 26**



గిద్దలూరు పట్టణంలో చిన్న మజీద్ రోడ్డులో వెస్ట్ పోస్టాఫీసు సమీపంలో శనివారం మిట్ట మధ్యాహ్నం ఒక ఇంటిలో అద్దెకున్న వ్యక్తే ఇంటియాజమానికి మత్తు డ్రిక్ త్రాపి చేతికి ఉన్న నాలుగు బంగారు గాజులు వలుచుకొని దోచుకెళ్లిన సంఘటన చోటుచేసుకుంది.

**వివరాల్లోకి వెళితే...:** చిన్న మసీదు రోడ్డులో మార్తాల ఈశ్వరమ్మ అనే మహిళ తన స్వంత ఇంట్లో నివాస ముంటుంది. మహిళ నివాసముంటున్న ఇల్లు రెండు అంతస్తులు ఉండగా పై భాగం ఖాళీగా ఉంది . ఆ ఇంట్లో గత రెండునెలల క్రితం ఒకవ్యక్తి ఆఇంట్లో అద్దెకు దిగ్గాడు. తాను ఫైనాన్స్ నడుపుతున్నట్లు , నేను తన తల్లి నివాసం ఉంటామని తన పేరు శేఖర్ అనిచెప్పి అద్దెకు దిగాడు ఇటీవల అద్దెకుడా ఫోన్ పే ద్వారా చెల్లించాడు. ఇది ఇలాఉండగా శనివారం నాడు తన తల్లి అనే చెప్పుకున్న మహిళతో వచ్చాడు . ఈ సందర్భంగా ఇంటి యజమాని తో మాట్లాడుతూ తన తల్లి చీరె పెట్టాలని అనుకొందని నీవు మేడ పైకి వచ్చి చీరె తీసుకెళ్లాలని కోరాడు. తనకు ప్రస్తుతం చీరె ఎందుకని వారించినా బలవంతంగా పైకి తీసుకెళ్లి చీరె పెట్టె ముందు ఇంటి యజమాని ఈశ్వరమాకు కూల్ డ్రింక్ ఇచ్చారు. ఆడ్రింక్ త్రాగగానే ఈశ్వరమ్మ మత్తులోకి వెళ్లి క్రీడపడిపోయింది అదే అదునుగా ఇంటి యజమాని ఈశ్వరమ్మ చేతికి ఉన్న నాలుగు బంగారు గాజులు వలుచుకొని , ఈశ్వరమ్మను మేడ పైనే ఇంట్లో ఉంచేసి ఇంటికి తాళాలు వేసి గాజులతో ఉడాయించారు. కొంత సేపటి తరువాత ఈశ్వరమ్మకు మత్తు వీడి లేచి చూసేసరికి తాను ఇంట్లో బంధిచబడినట్లు గుర్తించి కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు వచ్చి తాళాలు పగులగొత్తి ఈశ్వరమ్మను బయటికి తీసుకొచ్చారు . అప్పటికే ఈశ్వరమ్మ మత్తులో ఉండటం గమనించి వైద్యశాలకు తరలించి చికిత్స జరిపించారు. 100 కు ఫోన్ చేయగా సీఐ సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి కెళ్ళి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# డిమాండుకు అనుగుణంగా విద్యుత్ సరఫరాపై దృష్టి

### - విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి
### - ఒంగోలు లో రూ.3.40 కోట్లతో నిర్మించిన ట్రాన్స్ మిషన్ కార్పొరేషన్ ఎస్.ఈ. కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి
### - పాల్గొన్న ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు, సంతనూతలపాడు బి.ఎన్. విజయ్ కుమార్, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ సెప్టెంబర్ 26**





అన్ని వర్గాల డిమాండుకు అనుగుణంగా విద్యుత్ సరఫరాపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. ఒంగోలు నగరంలో రూ.3.40 కోట్లతో నిర్మించిన ట్రాన్స్ మిషన్ కార్పొరేషన్ ఎస్.ఈ. కార్యాలయాన్ని ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు, సంతనూతలపాడు బి.ఎన్. విజయ్ కుమార్, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారిలతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి, నాణ్యమైన సరఫరా కోసం ట్రాన్స్మిషన్ వ్యవస్థ బలోపేతానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ఒంగోలులోని సర్కిల్ కార్యాలయాన్ని ఏడాదిన్నరలో నిర్మించామన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత 132/220/400 కేవీ సబ్ స్టేషన్లను నిర్మిస్తోందన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం రూ. 6 వేల కోట్లతో సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5 సబ్ స్టేషనులను నిర్మిస్తున్నామని, నాలుగైదు నెలల్లోనే వీటిని ప్రారంభిస్తామన్నారు. రైతులకు సత్వరమే ట్రాన్స్ఫార్మర్ లు ఇస్తున్నామన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ వినియోగం అమాంతం పెరిగిందని, అయినా ఉత్పత్తి, సరఫరాలో ఎలాంటి ఇబ్బందీ కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జెన్కో వ్యవస్థను బలోపేతం చేసి నిరంతరాయ విద్యుత్ అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. విద్యుత్ డిమాండ్ అధికంగా ఉంటే తక్కువ ధరకు బహిరంగ మార్కెట్ లో కొనుగోలుకు ఆదేశించినట్లు తెలిపారు. విద్యుత్ డిమాండ్ ను అందుకునేందుకు పునరుత్పాదక ఇంధన వనరులను కూడా వినియోగించుకుంటున్నామన్నారు. బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్స్ ద్వారా పీక్ అవర్స్ లో విద్యుత్ డిమాండ్ ను అందుకోగలుగుతున్నామని, పీఎం సూర్యఘర్ త్వరగా పూర్తి చేసినట్లయితే కొంతమేర విద్యుత్ డిమాండ్ తగ్గుతుందని వివరించారు. సూర్యఘర్ పథకం కింద రాష్ట్రంలో 20 లక్షల కనెక్షన్ల లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఐదు లక్షల కనెక్షన్లు ఇచ్చినట్లు చెప్పారు. ఒంగోలులో స్మార్ట్ సిటీకి అవరోధం లేకుండా విద్యుత్ లైన్లు మార్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంపీ మాట్లాడుతూ సమయం మాదిరిగానే విద్యుత్ కూడా ఎంతో విలువైనదన్నారు. వృధా చేయకుండా వాడుకోవాలని ప్రజలకు సూచించారు. ఎమ్మెల్యే జనార్ధన్ మాట్లాడుతూ విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వలన ప్రజలకు మెరుగైన విద్యుత్ లభిస్తున్నట్లు చెప్పారు. ఒంగోలు లో ఇప్పటికే ఒక సబ్ స్టేషన్ ప్రారంభించామని, కొత్తపట్నం సబ్ స్టేషన్ ను కూడా త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. స్మార్ట్ సిటీ పైన ఉన్న హైటెన్షన్ విద్యుత్ లైన్లను మార్చేందుకు ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఈ. రాజగోపాల్ నాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# చిత్తూరు జిల్లాలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం

### -నూరు శాతం స్ట్రైక్ రేట్ కోసం సమష్టి కృషి






**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం సెప్టెంబర్ 26**

చిత్తూరు తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డి , జనసేన శాసనసభ్యులు ధర్మరాజు తో కలిసి ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ చిత్తూరు జిల్లా కూటమి నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో చిత్తూరు జిల్లాలో 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించడమే లక్ష్యంగా, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. అలాగే, చిత్తూరు మేయర్ పదవిని కూటమి అభ్యర్థి అత్యధిక మెజార్టీతో కైవసం చేసుకునేలా ప్రతి కూటమి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని పిలుపునివ్వడం జరిగింది.కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. చిత్తూరు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘన విజయాన్ని సాధించేందుకు గాను.. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకమై, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారు ఆధ్వర్యంలో రాష్ట్రంలో జరుగుతోన్న సంక్షేమం, అభివృద్ధిని వివరించి.. కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని, ఈ సమావేశంలో నిర్ణయించారు.

# శ్రీనగర్ కాలనీలో పోషణ మహా అవగాహన కార్యక్రమం

### -పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యకరమైన జీవనం




**కందుకూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 26**

9వ రాష్ట్రీయ పోషణ మహా కార్యక్రమంలో భాగంగా సీడీపీఓ ఉషారాణి ఆదేశాల మేరకు కందుకూరు ఏ సెక్టార్‌లోని శ్రీనగర్ కాలనీ–-2 అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ యు. ప్రభావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఎల్. సుజాత, ఆశా కార్యకర్త ఎ. అనిత, అంగన్వాడీ టీచర్ శ్రీలక్ష్మి, ఆయా రమాదేవితో పాటు గ్రామంలోని తల్లులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ప్రభావతి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు అందించే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా తల్లులు, చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోజువారీ ఆహారంలో రాగులు, సజ్జలు, జొన్నలు వంటి చిరుధాన్యాలతో పాటు ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలని అవగాహన కల్పించారు.రాష్ట్రీయ పోషణ మహాలో భాగంగా ఆహార వైవిధ్యం--తగిన ప్రోటీన్, అంగన్వాడీ కేంద్రాల్లో తాజా భోజనం, సమాజ భాగస్వామ్యం- బాధ్యత, పోషణ- బాల్య ప్రేరణ, ప్రధానమంత్రి మాతృ వందన యోజన వంటి ఐదు అంశాలపై ఈ నెల 9వ తేదీ నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కార్యక్రమాలు, అంగన్వాడీ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అంగన్వాడీ సిబ్బంది, తల్లులు కలిసి పోషణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

## సీఎం పర్యటనపై అధికారులతో ఎమ్మెల్యే సమావేశం

**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 26**

ఈనెల 29న ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలం రామాపురంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో కందుకూరు నియోజకవర్గం నుంచి జన సమీకరణలో భాగంగా, ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అధికారులతో చర్చించారు.ప్రతి మండలానికి ఆర్టీసీ బస్సులు కేటాయిస్తున్నందున, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఒక్కొక్క బస్సు నిర్వహణ బాధ్యతను ఒక ప్రభుత్వ ఉద్యోగికి అప్పజెప్పేలా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలను తీసుకువెళ్లడమే కాకుండా, తిరిగి ఇంటికి చేర్చే వరకు జాగ్రత్త వహించాలన్నారు. పల్లె పండుగ 3.0 లో భాగంగా, నియోజవర్గం నుంచి పంపించిన ప్రతిపాదనలు, నిధుల కేటాయింపు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఐదు మండలాల ఎంపీడీవోలు, ఏపీఎంలు, ఏపీవోలు పాల్గొన్నారు.




# ఆవిష్కరణలే యువత విజయానికి నాంది

### -విద్యార్థులు స్టార్టప్ వ్యవస్థాపకులుగా ఎదగాలి: డా. కె. విజయ శ్రీనివాస్

**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 26**

వర్క్‌షాప్‌లను కేవలం సర్టిఫికెట్ల కోసం కాకుండా, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆర్జించి వినూత్న ఆవిష్కరణలకు రూపం ఇచ్చే వేదికగా వినియోగించుకోవాలని ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ డా. కె. విజయ శ్రీనివాస్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విభాగం ఆధ్వర్యంలో విక్షా టెక్ సొల్యూషన్స్ సహకారంతో నిర్వహించిన "ఆర్డునో అండ్ ఐఓటీ అప్లికేషన్స్" అంశంపై ఆరు రోజుల సాంకేతిక వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఆలోచనను ఆవిష్కరణగా, ఆవిష్కరణను పేటెంట్‌గా, పేటెంట్‌ను స్టార్టప్‌గా, స్టార్టప్‌ను విజయవంతమైన వ్యాపారంగా మలచగలిగితేనే నిజమైన ఇంజినీర్‌గా గుర్తింపు పొందుతారు" అన్నారు. కళాశాలలోని ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ ద్వారా విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలను ఉత్పత్తులుగా అభివృద్ధి చేసి మార్కెట్‌లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, ఉద్యోగాలను సృష్టించే యువ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.వర్క్‌షాప్‌లో రిసోర్స్ పర్సన్ జోషిత ఆర్డునో ప్రోగ్రామింగ్,





ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), సెన్సర్ల వినియోగం, ఎంబెడెడ్ సిస్టమ్స్, రియల్‌టైమ్ ఇండస్ట్రియల్ అప్లికేషన్లు, ఉత్పత్తుల రూపకల్పన వంటి అంశాలపై విద్యార్థులకు ప్రాయోగిక శిక్షణ అందించారు. మినీ ప్రాజెక్టుల రూపకల్పన ద్వారా విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యాలు, సృజనాత్మక ఆలోచనలను పెంపొందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సి.హెచ్. రవి కుమార్ మాట్లాడుతూ, పరిశ్రమలతో అనుసంధానమైన ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు విద్యార్థులను భవిష్యత్ సాంకేతిక సవాళ్లకు సిద్ధం చేయడంతో పాటు ఉపాధి, పారిశ్రామిక అవకాశాలను అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దుతాయని తెలిపారు. అనంతరం వర్క్‌షాప్‌ను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు కరస్పాండెంట్ డా. కె. విజయ శ్రీనివాస్, డా. రవి కుమార్ మరియు రిసోర్స్ పర్సన్ జోషిత సంయుక్తంగా పాల్గొని సర్టిఫికెట్లను ప్రదానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి డా. జి. సురేష్, కార్యక్రమ సమన్వయకర్త మస్తాన్‌వలి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆక్స్‌ఫర్డ్‌లో ఉచిత ఆయుర్వేద, హోమియో వైద్య శిబిరం





**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 26:**

భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్లో భాగంగా కందుకూరులోని బి.ఆర్. ఆక్స్‌ఫర్డ్ ఒలింపియాడ్ పాఠశాలలో శనివారం ఉచిత ఆయుర్వేద, హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ఆయుర్వేద వైద్యులు ఆర్.టి.ఎస్. లక్ష్మీకుమారి, కె.వి. పద్మజాకుమారి, హోమియో వైద్యురాలు పి. రత్నావళి విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసి, వాటి వినియోగ విధానం, సంపూర్ణ ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు,బి.ఆర్. ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఆయుర్వేదం, హోమియో వైద్య విధానాలపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఉపయోగపడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి. బాల భాస్కరరావు, బి. నరేంద్రబాబు, పట్టణ బిజెపి అధ్యక్షులు చుండి మురళీధర్, ప్రధాన కార్యదర్శి రావి సరిత, జిల్లా కార్యవర్గ సభ్యులు మన్నేపల్లి వరప్రసాదరావు, తలపనేని అంజమ్మ, పాఠశాల డీన్, ప్రిన్సిపాల్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ పోషణ ప్రాధాన్యతపై సమగ్ర అవగాహన

**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 26**

గిద్దలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో చిన్నారుల, గర్భిణుల ఆరోగ్యాభివృద్ధే లక్ష్యంగా అంగన్ వాడీ ఉత్సవం 'సేవ సంకల్ప అభియాన్' ఘనంగా జరిపారు. ఈ క్రమంలో గిద్దలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ మహిత ఆదేశాల మేరకు, సూపర్వైజర్ జ్యోతి సమగ్ర సూచనలతో గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలోని మాయా బజార్ అంగన్వాడీ కేంద్రం (కోడ్ నెం: 10) లో మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 సంవత్సరాలు ప్రజాసేవలో అంకితమై ఉన్నారు అంగన్వాడి కేంద్రములలో "సేవ సంకల్ప సే వీక్షిత్ భారత్ 25 ఇయర్స్ పీపుల్ సర్వీస్ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాతినిధ్యం వహించిన 2వ వార్డు కౌన్సిలర్ బోనబోయిన చంద్రశేఖర్ యాదవ్, గిద్దలూరు సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్త బాలీశ్వరయ్య, అంగన్వాడీ కార్యకర్త ఎస్. వరలక్ష్మి, స్థానిక ప్రజలకు, లబ్ధిదారులకు సంపూర్ణ పోషణ ప్రాధాన్యతపై సమగ్ర అవగాహన కల్పించారు. కౌన్సిలర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు రక్తహీనత (ఎనీమియా)తో బాధపడుతున్న చిన్న పిల్లలు తీసుకోవాల్సిన సమతుల్య ఆహారం, ఐరన్ , విటమిన్లతో కూడిన పౌష్టిక ఆహారంపై ప్రభుత్వం అందిస్తున్న పోషక పదార్థాల ప్రాముఖ్యతను వివరించారు. సొసైటీ బ్యాంకు చైర్మన్ బాలిశ్వరయ్య మాట్లాడుతూ పౌష్టికాహార లోపం వల్ల కలిగే



దుష్పరిణామాలను వివరిస్తూ, స్థానిక కూరగాయలు, ఆకుకూరలు, తృణధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పౌష్టికాహారాన్ని ప్రతీ ఒక్క లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని పెద్దలు పిలుపునిచ్చారు. చిన్నారుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు, తల్లుల సంక్షేమానికి సంపూర్ణ పోషణే మూలస్తంభమని, ఈ దిశగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కార్యక్రమంలో పాల్గొన్న వార్డ్ కౌన్సిల్ బోనబోయిన చంద్రశేఖర్, గిద్దలూరు సొసైటీ బ్యాంకు చైర్మన్ దుత్త బాలీశ్వరయ్య, గిద్దలూరు టిడిపి నాయకులు రవి, మాజీ వార్డు మెంబర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు.

# స్వచ్ఛ రథం కార్యక్రమం ద్వారా పొడి చెత్త సేకరణ

### సేకరించిన పొడి చెత్తకు బదులుగా నిత్యవసర వస్తువులు పంపిణీ

### కార్యక్రమాన్ని పరివేక్షించిన ఎంపీడీవో రమేష్ బాబు పంచాయతీ అభివృద్ధి అధికారిని వై గీత





**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబర్ 26**

కొమరోలు పట్టణంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ రథం కార్యక్రమంలో పొడి చెత్తను సేకరించారు. స్వచ్ఛ రథంతో కొమరోలు వీధులలో పర్యటించి ఇంటింటి నుంచి పనికిరాని ప్లాస్టిక్ వస్తువులు, ఇనుప వస్తువులు, అట్టపెట్టెలు, నిరుపయోగమైన పుస్తకాలు తదితర పొడి చెత్త వస్తు సామాగ్రిని స్వచ్ఛ రథం నిర్వాహకులు ప్రజల నుంచి సేకరించారు. ప్రజలు అందించిన పొడి చెత్తకు బదులుగా ప్రజలకు నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు.స్వచ్ఛ రథం పర్యటన, పొడి చెత్త సేకరణ,, తదితర అంశాలపై స్వచ్ఛ రథం నిర్వాహకులు, స్వర్ణ కొమరోలు సిబ్బంది విస్తృత ప్రచారం చేశారు..ఆ కార్యక్రమాలను కొమరోలు ఎంపీడీవో రమేష్ బాబు, కొమరోలు పంచాయతీ అధికారిని వై గీత, స్వర్ణ కొమరోలు రెండు కార్యదర్శి ఓ ఆర్ జనార్దన్ రెడ్డి తదితరులు పర్యవేక్షించారు. ఇళ్లలో నిరుపయోగంగా ఉంటున్న పొడి చెత్త వలన ఎలాంటి ఉపయోగాలు లేకపోగా వాటి వలన అసౌకర్యం ఇబ్బందులు అనారోగ్య సమస్యలు ఏర్పడగలవని అధికారులు ప్రజలకు తెలిపారు. పొడి చెత్తకు సంబంధించిన వస్తువులను స్వచ్ఛ రథం నిర్వాహకులకు అందజేసి, అందుకు బదులుగా నిత్యవసర వస్తువులను పొంది వాటిని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు ప్రజలను కోరారు.

# జావా ప్రోగ్రామింగ్‌లో ప్రావీణ్యమే సాఫ్ట్‌వేర్ కెరీర్‌కు బలమైన పునాది

### -ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో జావా ఓఓపి, మల్టీథ్రెడింగ్‌పై సాంకేతిక వర్క్‌షాప్



**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 26**

సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించాలంటే ప్రోగ్రామింగ్‌పై బలమైన పునాది, నిరంతర సాధన, ప్రాయోగిక నైపుణ్యాలు అత్యవసరమని ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ డా. కె. విజయ శ్రీనివాస్ అన్నారు. ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి) కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్) విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన "మాస్టరింగ్ జావా ఓఓపి మల్టీథ్రెడింగ్" అంశంపై ఒకరోజు సాంకేతిక వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న సిద్ధాంత పరిజ్ఞానాన్ని ప్రాజెక్టుల రూపంలో ఆచరణలో పెట్టాలని, సాంకేతిక నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించడం ద్వారా మెరుగైన ఉద్యోగ అవకాశాలతో పాటు ఆవిష్కరణల దిశగా కూడా ముందుకు సాగవచ్చని తెలిపారు.వర్క్‌షాప్‌లో రిసోర్స్ పర్సన్ ధనలక్ష్మి జావా ఆబ్జెక్ట్ ఓరియెంటెడ్ ప్రోగ్రామింగ్ , మల్టీథ్రెడింగ్, థ్రెడ్ లైఫ్ సైకిల్, సింక్రొనైజేషన్, ఇంటర్–థ్రెడ్ కమ్యూనికేషన్, రియల్‌టైమ్ ప్రోగ్రామింగ్ అంశాలపై సమగ్రంగా వివరించారు. హ్యాండ్స్–ఆన్ సెషన్ల ద్వారా విద్యార్థులకు ప్రత్యక్ష ప్రోగ్రామింగ్ అనుభవాన్ని కల్పించి, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన కోడింగ్ నైపుణ్యాలను పెంపొందించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్) విభాగాధిపతి డా. కె. మోహనరావు మాట్లాడుతూ, ఇటువంటి సాంకేతిక వర్క్‌షాప్‌లు విద్యార్థుల్లో సమస్య పరిష్కార నైపుణ్యాలను, విశ్లేషణాత్మక ఆలోచనను ప్రోగ్రామింగ్ సామర్థ్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్యక్రమ సమన్వయకర్త ఎన్. మాధవరావు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలపై సంఘటితంగా పోరాడాలి

### -సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి.వి. కొండారెడ్డి




**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 26**

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాటాలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి.వి. కొండారెడ్డి పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. కందుకూరులోని దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ కందుకూరు నియోజకవర్గం, పొన్నలూరు మండల ముఖ్య కార్యకర్తలకు రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. సీఐటీయూ కందుకూరు పట్టణ సహాయ కార్యదర్శి ఎస్.ఏ. గౌస్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ కార్మికులు అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికుల హక్కులకు నష్టం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించేందుకు సంఘటితంగా పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాసులు, జిల్లా నాయకులు జి.వి.బి. కుమార్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సి.హెచ్. ఇందిరావతి, ఎస్.డి. గౌస్ బాషా, డి.ఎం. రాయుడు తదితరులు పాల్గొన్నారు. అంగన్వాడీ, ఆశా వర్కర్లు శిక్షణా తరగతులకు హాజరయ్యారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన బాల్యం

## ఐసిడిఎస్ సూపర్వైజర్ సుష్మారాణి -అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ మాసం కార్యక్రమాలు





**సంతమాగులూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 26**

చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనానికి అవసరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించడమే లక్ష్యంగా పోషణ మాసం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్వైజర్ సుష్మారాణి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శనివారం సంతమాగులూరు మండలంలోని వెల్లలచెరువు, కామేపల్లి, అడవిపాలెం గ్రామాల్లో ఆమె ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల్లో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

**పోషకాహారంపై అవగాహన..బీ** ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, దాని ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. చిన్నారుల ఎదుగుదలలో తొలి దశలో తీసుకునే ఆహారం కీలకమని, పిల్లలకు సమతుల ఆహారం అందించడంతో పాటు పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై సూచనలు..:** స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు తదితర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని సిబ్బంది సూచించారు. పిల్లల్లో పోషకాహార లోపాన్ని గుర్తించి అవసరమైన సూచనలు, సేవలను అందించడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలకంగా పనిచేస్తున్నాయని తెలిపారు.

**అంగన్వాడీ సిబ్బంది భాగస్వామ్యంతో**

వెల్లలచెరువు, కామేపల్లి, అడివిపాలెం గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. పోషణ మాసం సందర్భంగా గ్రామస్థాయిలో మరింత విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి తల్లులు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని సుష్మారాణి తెలిపారు.

# ప్రతి సమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తుంది

## టీడీపీ నియోజకవర్గఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు




**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 26**

ప్రజలు తమ వివిధ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల, అధికారుల చుట్టు తిరిగి విసిగి వేసారి పోకుండా సత్వరమే పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమం చేపట్టిందని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు.శనివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలనుండి . సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించి అక్కడికక్కడే అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్య పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని,గత ప్రభుత్వంలో మాదిరిగా ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా అధికారులను జవాబు దారితనంగా నిలిపారని అన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో చాలావరకు సమస్యలు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాబడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, సీనియర్ నాయకులు వేగినాటి శ్రీనివాస్, బోగోలు సుబ్బారెడ్డి, కాకర్ల కోటయ్య,మంత్రునాయక్,కందుల నారాయణ రెడ్డి,షేక్ మస్తాన్ వలి, షేక్ ఇస్మాయిల్, సయ్యద్ అల్లా మాలిక్,తదితరులు పాల్గొన్నారు.

# నెమలిగుండ్ల రంగస్వామీ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

**భక్తి పారవశ్యంలో ప్రకృతి సోయగాలను ఆస్వాదించిన భక్తులు**

**నెమలి గుండంలో స్నానాలు ఆచరించి స్వామి దర్శనం**

**తలనీలాలు సమర్పించిన భక్తులు**





**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 26**

గిద్దలూరు నియోజకవర్గం రాచర్ల మండలం జె పి చెరువు సమీపంలో నలమల్ల కొండకోనల్లో ప్రకృతి రమణీయ సోయగాల మధ్య స్వయంభుగా వెలసిన నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఈ ఆలయాన్ని ఒక్క శనివారం మాత్రమే తెరుస్తారు. .ఇటీవల కురిసిన వర్షాలకు ఆలయప్రాంత కొండకోనలు పచ్చగామారి గుండ్లకమ్మ దివినుచి భువికి జలపాతం జాలువారుతూ , తేనెటీగలు ఝుకారల మధ్య , అబ్బురపర్చే రంగడి సేవలమధ్య స్వామిని దర్శఉంచుకొని తీర్ధ ప్రసాదాలు స్వికరించారు . పాలక మండలి చైర్మన్ సిద్ధం నరసింహులు కార్యనిర్వహాణాధికారి నాగయ్యలు భక్తులకు అన్నిఏర్పాట్లు చేశారు.

# ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పూర్తి భరోసా

## టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు






**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 26**

నిరుపేద మధ్యతరగతి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అన్ని రకాల వైద్య సేవలు అందిస్తుందని, ఖరీదైన వైద్యం చేయించుకున్న వారికీ ముఖ్యమంత్రి సహాయ భరోసా ఇస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు. అనారోగ్యం కారణంగా వివిధ వ్యాధులకు ఆపరేషన్లు చేయించుకున్న వారికీ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను 50 మందికి 50,50,114/- రూపాయలను శనివారం పార్టీ కార్యాలయం లో ఆయన పంపిణి చేసారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం బారినపడి ఎవరు బాధ పడకూడదని, ఆర్థికసమస్యతో ప్రైవేట్ ఆసుపత్రులలో వైద్యం చేయించుకున్నవారికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తమ సహాయ నిధి నుండి ఆర్థిక చేయూత అందిస్తున్నారని అన్నారు. ఇంటికి పెద్ద కొడుకుల ఆదుకుంటూ, అన్ని రకాల సంక్షేమ పథకాలను అందిస్తున్న చంద్రన్నకు మనం అండగా నిలిచి మద్దతు తెలుపాలన్నారు. ఈ సందర్బంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఎరిక్షన్ బాబు గారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో మండల పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగళ రెడ్డి, నాయకులు బోగోలు సుబ్బారెడ్డి,కందుల నారాయణ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఆదివారమైనప్పటికీ.... పనిచేయనున్న బ్యాంకులు

**మూడు రోజుల బ్యాంక్ ఉద్యోగుల దేశవ్యాప్త సమ్మె కారణంగా**

**ఆదివారం బ్యాంకులు పని చేయుటకు చర్యలు తీసుకున్న బ్యాంకు ఉన్నతాధికారులు.**

**బ్యాంకు లావాదేవీలను కొనసాగించుకోవాలని ఖాతాదారులకు అధికారుల విజ్ఞప్తి.**




**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబరు 26.**

ఈనెల 27వ తేదీ ఆదివారం అయినప్పటికీ ఖాతాదారుల సౌకర్యార్థం ఆదివారం కూడా బ్యాంకులు పనిచేయుటకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బిఐ )ఆర్థిక సేవలు విభాగం (డి ఎఫ్ ఎస్) ఆదేశాల మేరకు అందుకు అనుగుణంగా చర్యలు తీసుకున్నామని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎస్ కే షాహిర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. బ్యాంకు ఉద్యోగుల మూడు రోజుల దేశవ్యాప్త సమ్మె కారణంగా ఈనెల 28,29,30 తేదీలలో బ్యాంకులు మూతపడనున్నాయని, ఆయన తెలిపారు. అంతేగాక ఈనెల 25వ తేదీ నాలుగవ శనివారం బ్యాంకులకు సెలవు వచ్చిందని, అదేవిధంగా 26వ తేదీ ఆదివారం కూడా బ్యాంకులకు సెలవు ఉండేదని ఆయన చెప్పారు. ఈనెల 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకులు మూతపడి ఖాతాదారులకు ఇబ్బందులు కలిగే అవకాశాలు ఉన్నట్లుగా తాము గుర్తించామన్నారు. అందువల్ల ఖాతాదారులకు సౌకర్యం కల్పించేందుకు వీలుగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆర్థిక సేవల విభాగం ఈనెల 27వ తేదీ ఆదివారం అయినప్పటికీ ఆరోజు బ్యాంకులు యధావిధిగా పనిచేసి, ఖాతాదారులకు సాధారణ ప్రజలకు లావాదేవీలు కొనసాగించుకునేందుకు నిర్ణయించినట్లుగా ఆయన తెలిపారు. కావున ఈనెల 27వ తేదీ ఆదివారం అన్ని జాతీయ బ్యాంకులు యధావిధిగా పనిచేస్తాయని అందువల్ల ఖాతాదారులు తమ బ్యాంకు లావాదేవీలను యధావిధిగా కొనసాగించుకోవచ్చని, అంతేకాక ఏటీఎంలు కూడా నెల 30వ తేదీ వరకు పనిచేస్తాయని ఆయన తెలిపారు.

# ఎగువపల్లిలో సిమెంటు రోడ్డుకు భూమి పూజ చేసిన టిడిపి నాయకులు

## ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి కి కృతజ్ఞతలు తెలిపిన అట్లూరి



**సి.ఎస్.పురం,పెన్ పవర్ సెప్టెంబర్ 26**

గ్రామాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు అన్నారు.మండలంలోని ఎగువపల్లి గ్రామంలో శనివారం కనిగిరి శాసనసభ్యులు ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు టీడీపీ నాయకులు భూమిపూజ చేశారు ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎగువపల్లి గ్రామంలో వీబీజీ-రామ్ పథకం ద్వారా 900 మీటర్ల సిమెంటు రోడ్డుకు రూ.1.10 కోట్లు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మంజూరు చేయించినట్లు తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజలకు మెరుగైన రహదారులు మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కృషి చేస్తున్నారన్నారు సిమెంటు రోడ్డును మంజూరు చేయించి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి ఎగువపల్లి గ్రామ ప్రజల తరపున నీటి సంఘం అధ్యక్షురాలు అట్లూరి సుబ్బలక్ష్మమ్మ రామకృష్ణరాజు మరియు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి నాగిశెట్టి చెన్నమ్మ చిన్న మాలకొండయ్య, అట్లూరి రామకృష్ణంరాజు, జిల్లా గొర్రెల పెంపకం సహకార సంఘం సభ్యులు కోనంగి వెంకట కొండయ్య, బత్తుల వెంకటాద్రి, గ్రామ పార్టీ అధ్యక్షులు డి మాలకొండయ్య, దర్శి ఆదినారాయణ, బూత్ కన్వీనర్ రమణయ్య, రైతు సంఘం కార్యదర్శి తెల్లగొర్ల సుబ్బారావు, ఆర్ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

# సింగరాయకొండలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు





**సింగరాయకొండ జరుగుమల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 26**

సింగరాయకొండజాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం, తిరుపతి అర్బన్ పరిధిలోని మంగళం ప్రాంతానికి చెందిన ఐదుగురు కారులో విజయవాడకు వెళ్తుండగా, గోల్డెన్ కేఫ్ హోటల్ సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న లారీని కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో హరిప్రసాద్, విశాలాక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా, లావణ్య, కాన్షితు, ప్రణశ్రీ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. లారీ వెనుక భాగంలో కారు ఇరుక్కుపోవడంతో మృతదేహాలను వెలికితీయడానికి అగ్నిమాపక సిబ్బంది దాదాపు గంటపాటు శ్రమించారు. కారు డోర్లను కట్ చేసి మృతదేహాలను బయటకు తీశారు. ఘటనను గమనించిన కందుకూరు సీఐ అన్వర్ భాష క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు సహకరించారు. సింగరాయకొండ సీఐ వై. శ్రీహరి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పల్లె పండుగ 3.0 విజయవంతానికి నేడు సమీక్ష సమావేశం

**బొబ్బూరి రమేష్**

**సి.ఎస్.పురం,పెన్ పవర్ సెప్టెంబర్ 26**



కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిశీలకురాలు సుధా అధ్యక్షతన నేడు ఆదివారం పల్లె పండుగ 3.0 కార్యక్రమం గురించి మండల కేంద్రంలోని సి ఎస్ పురం టిడిపి కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు మండల టిడిపి అధ్యక్షుడు బొబ్బూరి రమేష్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29న వరికుంటపాడు మండలం రామాపురం గ్రామంలో నిర్వహించనున్న పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, నాయకుల భాగస్వామ్యంపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.మండలంలోని 23 గ్రామ పంచాయతీల గ్రామ పార్టీ అధ్యక్షులతో పాటు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ నాయకులు, అనుబంధ కమిటీ అధ్యక్షులు, రేషన్ డీలర్లు, కేఎస్ఎస్ సభ్యులు, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.

# డా.చంద్రశేఖర్ గుప్తా ను సన్మానించిన ఆర్య వైశ్యులు



**కందుకూరు పెన్ పవర్, సెప్టెంబర్ 26**

గురువారం వెలువడిన పి జీ నీట్ ఫలితాల్లో కందుకూరుకు చెందిన ఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు పెద్ద కుమారుడు డాక్టర్ చక్కా చంద్రశేఖర్ గుప్త ఆల్ ఇండియా ర్యాంక్ 509 సాధించిన సందర్భంగా కందుకూరు పామూరు రోడ్డు రామాలయం కమిటీ వారు,శ్రీ సంగమేశ్వర ఆర్యవైశ్య సత్రం వారు డాక్టర్ చంద్రశేఖర్ గుప్తాను వారి నివాసంనందు శాలువాకప్పి,పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆల్ ఇండియా పీజీ నీటిలో 509 ర్యాంకు సాధించి కందుకూరు కి మంచి పేరు తెచ్చావని కొనియాడారు. మంచి డాక్టర్ గా ఎదిగి సమాజానికి సేవలందించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వినాయక దేవస్థానం ప్రెసిడెంట్ బొగ్గవరపు సత్యనారాయణ, పామూరు రోడ్డు రామాలయం ప్రెసిడెంట్ మున్నలూరు వెంకట సుబ్బారావు, శ్రీ సంగమేశ్వర ఆర్యవైశ్య అన్నదాన సత్ర ప్రెసిడెంట్ పాదర్తి సుబ్బారావు, ఆర్యవైశ్య నాయకులు గోనుగుంట వేణు, యడవలపాటి సుబ్బారావు, బొమ్మిశెట్టి కోటేశ్వరరావు,బొమ్మిశెట్టి రామకోటయ్య, పల్లపోతు రామలింగేశ్వర రావు, పల్లపోతు రామకృష్ణ, పేటేటికృష్ణ, వెంగమాంబ కోటయ్య, కోట వెంకన్న, నీలిశెట్టి శేషు,డా "చంద్రశేఖర్ గుప్తా కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ స్మశాన వాటిక మినీ గోకులం షెడ్ నిర్మాణ పనులు పరిశీలించిన డిడబ్ల్యూయంఏ ప్రాజెక్ట్ డైరెక్టర్

### కార్యక్రమంలో పాల్గొన్న ప్రకాశం జిల్లా డిడబ్ల్యూయంఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ యం. వెంకటేశ్వరావు

### మక్కెనవారిపాలెం, పుట్టావారిపాలెం స్మశాన వాటికలను పరిశీలించిన డిడబ్ల్యూయంఏ ప్రాజెక్ట్ డైరెక్టర్

**సంతమాగులూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 26**

సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం లో బీసీ స్మశాన వాటిక సందర్శించి డిడబ్ల్యూయంఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ యం. వెంకటేశ్వరావు పరిశీలించారు. స్మశాన వాటిక లేకుండా ఇబ్బంది పడుతున్న గ్రామ ప్రజలకు ఎంజిఎన్ఆర్ఇజిఎ నిధులతో 2025-26 ఆర్థిక సంవత్సరంలో నిర్మించడం జరిగిందని సిబ్బంది జిల్లా అధికారి వారికి వివరించారు. ఇంతకుముందు వసతులు రూమ్ లు ఏమీ లేకుండా ఉండేదని ప్రస్తుతం ఇప్పుడు అన్ని ఉన్నందున ప్రజలు చక్కగా ఉపయోగించుకొని సంతృప్తి వ్యక్తం చేశారని తెలియజేశారు. అనంతరం సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం గ్రామంలో ఎస్. ఏడుకొండలు మరియు జి ఏడుకొండలు వారు చేపట్టిన పశువుల కొట్టం క్యాటిల్ షెడ్ 3.0 నిర్మాణ పనులను కూడా ప్రాజెక్ట్ డైరెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత మరియు లబ్ధిదారునికి అందుతున్న ప్రయోజనాలను పరిశీలించారు. ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా పుట్టావారిపాలెం గ్రామంలో ఎస్ గురుమూర్తి లబ్ధిదారునిగా నిమ్మతోటను కూడా ప్రాజెక్ట్ డైరెక్టర్ సందర్శించి పరిశీలించారు. జామ మొక్కల పెరుగుదల, తోట నిర్వహణ, మొక్కల సంరక్షణకు సంబంధించిన వివరాలను సంబంధిత సిబ్బంది



మరియు లబ్ధిదారులనను అడిగి తెలుసుకున్నారు. మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తోటలను సక్రమంగా నిర్వహించి మంచి దిగుబడులు సాధించేలా చర్యలు తీసుకోవాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ సూచించారు. ఏపీఓవిబి సిబ్బంది కూడా క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో పాల్గొని, జరుగుతున్న పనులకు సంబంధించిన వివరాలను అధికారులకు తెలియజేశారు. ఉపాధి హామీ పనుల్లో నాణ్యత,



పారదర్శకత, కూలీలకు సకాలంలో ఉపాధి కల్పన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత సిబ్బందికి ప్రాజెక్ట్ డైరెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి తో పాటు ఎంపీడీవో జ్యోతిర్మయి మండల సిబ్బంది, ఏపీఓవిబి-జిఆర్ఏఎంజి సిబ్బంది గ్రామ సిబ్బంది ఏలూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానం



**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 26**

రాచర్ల, కొమరోలు, గిద్దలూరు మండలాల తెలుగు ఉపాధ్యాయుల క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు) నందు శనివారం నిర్వహించారు. ఇటీవల మార్కాపురం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు పొందిన కొమరోలు మండలం రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు పాశం రాంప్రసాద్ ను, ఇటీవల తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తూ రాచర్ల మండలం ఎడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఉద్యోగ విరమణ చేసిన కంచర్ల రంగ వరప్రసాద్ ను ఘనంగా సన్మానించారు . ఈ సందర్భంగా ఇరువురి సేవలను పలువురు ఉపాధ్యాయులు, వక్తలు కొనియాడుతూ... వారిపై ఆటవెలది పద్యరూపంలో రాసిన పి.పద్మనాభ రాజు పద్యాలను రిసోర్స్ పర్సన్ పి.మురళీకృష్ణ రాగయుక్తంగా పాడి వినిపించారు. ఈ కార్యక్రమంలో రెండవ రిసోర్స్ పర్సన్ నల్లగట్ల రామకృష్ణ , తెలుగు విషయ నిపుణులు సూరే శ్రీనివాసులు, మూడు మండలాల ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బోడవాడ అడవిలో పచ్చదనం కోసం డ్రోన్ విప్లవం

### 60 వేల విత్తన బంతులతో సరికొత్త ప్రయోగం



**పీసీపల్లి, పెన్ పవర్ సెప్టెంబర్ 26**

అడవులను కాపాడటంతో పాటు పచ్చదనాన్ని పెంచేందుకు ఏపీ అటవీ శాఖ వినూత్న రీతిలో ముందడుగు వేసింది. మార్కాపురం జిల్లాలో కనిగిరి రేంజ్ పరిధిలోని బోడవాడ రిజర్వ్ అడవిలో శనివారం భారీ ఎత్తున విత్తన బంతులు చల్లే కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. **డ్రోన్లతో 60 వేల విత్తనాలు:** సాంప్రదాయ పద్ధతికి భిన్నంగా అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించారు. రెండు డ్రోన్ల సహాయంతో ఏకంగా 60 వేల విత్తన బంతులను అడవిలోని దట్టమైన ప్రాంతాల్లో చల్లారు. మనుషులు వెళ్లలేని ప్రాంతాల్లో కూడా డ్రోన్ల ద్వారా సులభంగా విత్తనాలు చల్లడం వీలవుతుందని అధికారులు తెలిపారు. వర్షాకాలం ముగిసేలోపు ఈ విత్తనాలు మొలకెత్తి అడవి మరింత దట్టంగా మారుతుందని భావిస్తున్నారు. **ప్రజల భాగస్వామ్యం:** ఈ కార్యక్రమంలో కనిగిరి అటవీ క్షేత్ర అధికారి ఆరిఫ్ ఖాన్, ఉప అటవీ క్షేత్ర అధికారి శ్రీహరి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు. వారితో పాటు బోడవాడ, గుంటూరు లింగన్నపాలెం గ్రామ ప్రజలు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. వారికి అడవుల ఆవశ్యకతపై అధికారులు అవగాహన కల్పించారు. అటవీ విస్తీర్ణాన్ని పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని చేపడతామని అటవీ క్షేత్ర అధికారి ఆరిఫ్ ఖాన్ ఈ సందర్భంగా తెలిపారు.

## మార్కాపురం జిల్లా ప్లానింగ్ అండ్ యం.ఐ.ఎస్ కో-ఆర్డినేటర్ గా డాక్టర్ మొర్రి.పిచ్చయ్య నియామకం

### నియామక పత్రాన్ని అందుకుంటున్న మొర్రి. పిచ్చయ్య



**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 26**

మార్కాపురం జిల్లా విద్యాశాఖ -సమగ్ర శిక్షా పరిధిలోని జిల్లా ప్లానింగ్ అండ్ యం.ఐ.ఎస్ కో-ఆర్డినేటర్ గా డాక్టర్ మొర్రి.పిచ్చయ్య నియమితులయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి సామ సుబ్బారావు నియామక ఉత్తర్వులను అందజేశారు. డాక్టర్ మొర్రి. పిచ్చయ్య హై స్కూల్ ప్లస్, గిద్దలూరు నందు పిజిటి (తెలుగు)గా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా విద్యా ప్రణాళిక, కార్యక్రమాల పర్యవేక్షణ, విద్యా సమాచార సేకరణ, డేటా నిర్వహణ, విశ్లేషణ, నివేదికలను రూపొందించాలి. మండలాల నుంచి వచ్చిన డేటాను పరిశీలించి సమీకరించడం. పాఠశాలలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించడం తదితర కార్యక్రమాలు నిర్వహించవలసి ఉంటుంది. మండల విద్యాశాఖ అధికారులు గిరిధర్ శర్మ, నాగభూషణ రెడ్డి, కావడి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ బృందం జయచంద్రా రెడ్డి, రంగారెడ్డి, రమేష్, వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.

# గిద్దలూరులో కార్డెన్ సెర్చ్

### మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి -అర్బన్ సీఐ సురేష్





**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 26**

గిద్దలూరు పట్టణంలోని ఏబీఎం పాలెం లో అర్బన్ సీఐ కె సురేష్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. 29 ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించామని డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ ముందుండాలని . యువత గంజాయి వంటి మత్తు పదార్థల బారిన పడి తమ జీవితాన్ని నాశనం చేసుకోవద్దు అంటూ మత్తు పదార్థాలు వాడడం వలన కుటుంబాలు కూడా రోడ్డున పడుతాయని ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి ఈగల్ టీం సీఐ దేములు తెలియజేశారు. సమాచారం అందిన వెంటనే లేకపోయినా ఎక్కడైనా గంజాయి మత్తు పదార్థాలు వంటి వినియోగిస్తే వెంటనే 1972 టోల్ ఫ్రీ నెంబర్ కి ఫిర్యాదు చేయాలి సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లను గోప్యంగా ఉంచుతామని మేము సైతం డ్రగ్స్ పై పోరాటానికి సిద్ధమంటూ డ్రగ్స్ ను తరిమేద్దాం ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మిద్దాం అంటూ ప్రజల చేత ప్రతిజ్ఞ నిర్వహించారు. అనుమానాస్పద వస్తువులు కనిపించిన ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని,డ్రగ్స్ నిర్మూలన కొరకు యువత ముందుండి పోరాటం చేయాలని తెలియజేశారు.

## దద్దవాడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుడిమెట్ట కొత్తపల్లి వాసి కొత్తకోట జనార్ధన్ రాజు మృతి

### ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

### ద్విచక్ర వాహన దారుడు కొత్తకోట జనార్ధన్ రాజు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి



దర్యాప్తు చేస్తున్న కొమరోలు ఎస్సై కోట నాగేంద్రరావు



**కొమరోలు పెన్ పవర్ సెప్టెంబర్ 26**

కొమరోలు మండలం దద్దవాడ స్వర్ణ గ్రామ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాచర్ల మండలం గుడిమెట్ట కొత్తపల్లి గ్రామానికి చెందిన కొత్తకోట జనార్ధన్రాజు (30) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. కొమరోలు ఎస్సై కొత్తకోట నాగేంద్రరావు తెలిపిన వివరాల మేరకు శనివారం త్రిపురాంతకం నుంచి కొమరోలు మండలం తాటిచెర్ల మోటు, గిద్దలూరు మీదుగా బనగానిపల్లెకు యూరియా లోడుతో వెళ్తున్న లారీ, గిద్దలూరు నుంచి గుడిమెట్ట కొత్తపల్లికు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని దద్దవాడలో గల స్వర్ణ గ్రామ కార్యాలయం - నారాయణ పల్లె క్రాస్ రోడ్డు మధ్య నంద్యాల ఒంగోలు జాతీయ రహదారిపై ఢీకొన్నది. ఆ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న కొత్తకోట జనార్ధన్ రాజు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కొమరోలు ఎస్సై నాగేంద్రరావు తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి, ట్రాఫిక్ కు అంతరాయం కలుగకుండా తగు చర్యలు తీసుకున్నారు. జరిగిన రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని. మృతి చెందిన జనార్ధన్ రాజు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని జనార్ధన్ రాజు బంధువులకు అప్పగించనున్నట్లుగా ఎస్సై నాగేంద్ర రావు తెలిపారు.

## జిల్లాను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

### కలెక్టర్ విజయ సునీత



**మార్కాపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 26**

నూతన మార్కాపురం జిల్లాను గ్లోబల్ హార్టికల్చర్ హబ్ గా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ విజయ సునీత అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ విజయ సునీత రైజింగ్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఉద్యాన రంగ అభివృద్ధి పై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు ద్వారా జలాలు అందుబాటులోకి రావడంతో ఉద్యాన పంటల సాగుకు అనుకూల పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు.జిల్లాలో ప్రస్తుతం 10 లక్షల టన్నులుగా ఉన్న ఉద్యాన ఉత్పత్తిని మూడేళ్లలో 15 లక్షల టన్నులకు పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అదనంగా 64 వేల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ విస్తరిస్తామని, ఆరు క్లస్టర్లలో మూడు దశల్లో కార్యక్రమాలు అమలు చేస్తామని కలెక్టర్ వివరించారు.రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అంతర్జాతీయ మార్కెటింగ్ పై అవగాహన కల్పిస్తామని, అక్టోబర్ 2న నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ విజయ సునీత తెలిపారు.

## అసత్య ప్రచారం పై చర్చకు సిద్ధమా



పొన్నలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 26

రాష్ట్రంలో కొత్తగా మంజూరు కాబోతున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల వ్యవహారంలో వైసీపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని పొన్నలూరు మండల తెలుగుదేశం పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పింఛన్ల దరఖాస్తుదారుల నుంచి తాము డబ్బులు వసూలు చేస్తున్నట్లు వైసిపి నేతలు ఆరోపించడంపై మండిపడ్డారు. ఒక్కరి దగ్గరయినా డబ్బులు తీసుకున్నట్టు నిరూపించాలని సవాల్ విసిరారు. అవినీతికి పాల్పడ్డ చరిత్ర వైసిపిది ఆ పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డిది అని విమర్శించారు. గత ప్రభుత్వంలో ప్రతి విషయంలో వైసిపి నేతలు అక్రమాలకు పాల్పడి, ప్రభుత్వ సొమ్మును దోచుకున్నారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వంలో నిష్పక్షపాతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ఎవరి హయాంలో అక్రమాలు జరిగాయో ప్రజలకు తెలుసున్నారు. వైసీపీ నేతలు ఇకనైనా బుద్ధి మార్చుకుని ప్రవర్తించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కర్ణ కోటిరెడ్డి, కొండ్రగుంట శ్రీనివాసులు, మండవ ప్రసాద్, గుమ్మళ్ల వెంకట్రావు, పల్లపోతు రమేష్ బాబు, డి మధుబాబు, మన్నేం రమణయ్య, పి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

**సి.ఎస్.పురం,పెన్ పవర్ సెప్టెంబర్ 26**

కలియుగ ప్రత్యక్ష దైవంగా కొలువుదీరిన తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని శనివారం సి.ఎస్.పురం మాజీ జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు, మండల తెలుగు యువత అధ్యక్షుడు కామనబోయిన వెంకటస్వామి, ఇండ్ల బాలయ్య మరియు టైగర్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీవారి దర్శనం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. దర్శనం అనంతరం ఆలయ తీర్థప్రసాదాలను స్వీకరించారు.



# కోవిలంపాడులో కొలువుదీరిన గణనాధునికి ఘనమైన కానుకలు

## హోరాహోరీ పోటీల్లో గణపతి లడ్డు 2.40 లక్షలకు కైవసం చేసుకున్న గోను వెంకటేశ్వర రెడ్డి

## కలశం దక్కించుకున్న అమడసాని పెద్ద చెన్నారెడ్డి





**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 26**

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కోవిలంపాడు గ్రామంలో శనివారం విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాట భక్తుల్లో ఉత్సాహాన్ని నింపింది. గణనాథునికి సమర్పించిన లడ్డా, కలశం, హుండీ కానుకలను వేలం వేయగా భక్తులు నువ్వా.. నేనా.. అన్నట్లుగా పోటీపడి వేలంపాటలో పాల్గొన్నారు. స్వామివారి ప్రసాదాలను దక్కించుకోవడాన్ని అదృష్టంగా భావించిన భక్తులు పోటాపోటీగా ధరలు పెంచుతూ వేలంపాటలు రసవత్తరంగా సాగాయి లడ్డా వేలంపాట రికార్డు ధర పలికింది ఈ సందర్భంగా గోను వెంకటేశ్వరరెడ్డి రూ. 2. 40 లక్షలకు దక్కించుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి లడ్డాకు మరింత అధిక ధర పలకడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అదే విధంగా గణనాథునికి ఏర్పాటు చేసిన కలశాన్ని అమడసాని పెద్ద చెన్నారెడ్డి రూ. 1 లక్ష 50 వేలకు కైవసం చేసుకున్నారు. స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీ వేలంపాటలో గోను రాజమోహన్ రెడ్డి కి రూ. 31 వేలకు పాట దక్కింది. వేలంపాటలో స్వామివారి ప్రసాదాలను దక్కించుకున్న వారిని గ్రామస్తులు, విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ సభ్యులు అభినందించారు. అనంతరం వేదపండితులు మంకాల శివప్రసాద్ శర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, గోత్రనామాలతో విజేతలకు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం లడ్డా, కలశం తదితర ప్రసాదాలను మేళతాళాలు, బాణసంచా నడుమ ఊరేగింపుగా వారి ఇళ్లకు తీసుకెళ్లారు. వేలంపాటలో గోను వెంకటేశ్వర రెడ్డి, అమడసాని పెద్ద చెన్నారెడ్డి, గోను రాజమోహన్ రెడ్డి ఉత్సాహంగా పాల్గొని పాటలు దక్కించుకోవడంపై గ్రామస్తులు ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు

## ఈవీఎం గోదాముల భద్రతపై కలెక్టర్ పరిశీలన



**విశాఖపట్నం, పెన్ పవర్ సెప్టెంబర్ 26**

చినగదిలి పరిధిలోని ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాల భద్రతకు కల్పిస్తున్న ఏర్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. గోదాముల పరిసరాల భద్రత, సీసీ కెమెరాల పనితీరు, షట్టర్ల పరిస్థితి, భద్రతా సిబ్బంది విధులు, తాళాలు--సీల్స్ నిర్వహణ తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా ఈ పరిశీలన చేపట్టినట్లు అధికారులు తెలిపారు. గోదాముల భద్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 28న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

**విశాఖపట్నం, పెన్ పవర్ సెప్టెంబర్ 26**

విశాఖపట్నం జిల్లాలో 18వ జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని సెప్టెంబర్ 28న నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పి. జగదీశ్వర రావు తెలిపారు. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల వయస్సు గల సుమారు 5,74,496 మంది పిల్లలు, కిశోరులకు ఆల్బెండజోల్ మాత్రలు అందించనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఇతర విద్యాసంస్థల్లో ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో మాత్రలు ఇవ్వనున్నారు. సెప్టెంబర్ 28న మాత్రలు తీసుకోలేని పిల్లలకు అక్టోబర్ 5న మాప్-అప్ డే నిర్వహించి మాత్రలు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. పిల్లల ఆరోగ్యం, పోషకాహార పరిరక్షణలో భాగంగా తల్లిదండ్రులు కార్యక్రమానికి సహకరించాలని డీఎంహెచ్ఓ కోరారు.

## గర్భస్థ శిశు లింగ నిర్ధారణపై కఠిన చర్యలు

**అనకాపల్లి, పెన్ పవర్ సెప్టెంబర్ 26**

గర్భస్థ శిశు లింగ నిర్ధారణను అరికట్టేందుకు గర్భధారణకు ముందు, గర్భధారణ సమయంలో నిర్ధారణ సాంకేతికతల చట్టం--1994ను కఠినంగా అమలు చేయాలని అనకాపల్లి ఇంచార్జ్ ఆర్డీఓ వై. శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. శనివారం అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయంలో చట్టం అమలుపై సబ్ డివిజన్ స్థాయి సలహా కమిటీ, సంబంధిత అధికారుల సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని అల్ట్రాసౌండ్, స్కానింగ్ కేంద్రాలు చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రిజిస్ట్రేషన్, రికార్డుల నిర్వహణ, ఫారం-ఎఫ్ తదితర అంశాలను నిబంధనల ప్రకారం నిర్వహించాలన్నారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టవిరుద్ధమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కానింగ్ కేంద్రాలపై నిరంతరం నిఘా ఉంచి, తరచూ తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. లింగ నిర్ధారణకు వ్యతిరేకంగా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వెంకటేష్, పోలీసు అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, డెమో సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధల నడుమ గణపయ్యకు ఘన వీడ్కోలు





**సి ఎస్ పురం, పెన్ పవర్ సెప్టెంబర్ 26**

మండలంలోని కోవిలంపాడు గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జన వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపయ్యకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వేద పండితులు మంకాల శివప్రసాద్ శర్మ గణనాథునికి సంప్రదాయబద్ధంగా శాస్త్రోక్త పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలు చేసి హారతులు సమర్పించారు. పూజలందుకున్న గణనాథుని నిమజ్జనానికి తరలించే సమయంలో గ్రామంలో భక్తి సందడి నెలకొంది. గణపతి శోభాయాత్రలో యువత ఉత్సాహంగా పాల్గొంది. బాణాసంచా పేలుళ్లు, టపాసుల శబ్దాలు, డప్పుల మోతల నడుమ యువకుల కేరింతలు, భక్తుల నినాదాలతో గ్రామ వీధులు హోరెత్తాయి. పలువురు భక్తులు రంగులు చల్లుకుంటూ 'గణపతి బప్పా మోరియా' అంటూ నినాదాలు చేస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. వేదమంత్రాల నడుమ గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కలిసి సంప్రదాయబద్ధంగా నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మహిళలు భక్తులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# జమ్ముళ్లపల్లి గ్రామంలో జ్వరాలపై అధికారులను అప్రమత్తం చేసిన శాసన సభ్యులు ముత్తుముల

**గిద్దలూరు పెన్ పవర్ సెప్టెంబర్ 26**



గిద్దలూరు మండలం ఆదిమూర్తిపల్లి పంచాయతీ పరిధిలోని జమ్ముళ్లపల్లి గ్రామంలో జ్వరాలతో పలువురు అనారోగ్యానికి గురైన నేపథ్యంలో, శనివారం కర్నూలు ఆసుపత్రిలో ఇద్దరు మృతి చెందిన విషయం తెలుసుకున్న శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి వెంటనే స్పందించారు. ఈ విషయంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి, గ్రామంలో పరిస్థితిని సమీక్షించి, అవసరమైన వైద్య సేవలను తక్షణమే అందించాల్సిందిగా సూచించారు. జమ్ముళ్లపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాల్లో స్పెషలిస్ట్ వైద్యులు కూడా పాల్గొని, ప్రజలకు అవసరమైన పరీక్షలు, చికిత్సలు , వైద్య సలహాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. గ్రామంలో జ్వరాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన అన్ని వైద్య చర్యలు చేపట్టి పరిస్థితిని త్వరితగతిన అదుపులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ప్రజలు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండి, జ్వరం లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి, వైద్య సిబ్బంది సూచనలు తప్పనిసరిగా పాటించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కోరారు.

# పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం

## ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి



**మార్కాపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 26**

మార్కాపురం పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని 13, 14, 15 వార్డుల్లో వీధి వీధి పర్యటించి స్థానిక ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల కోరిక మేరకు 15వ ఫైనాన్స్, హెచ్ఏఎం నిధులతో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే ఈ రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామని, పట్టణంలోని ప్రతి రోడ్డును సీసీ రోడ్డుగా మార్చి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుల రామిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ వెంకటరెడ్డి, పట్టణ తెలుగుదేశం నాయకులు, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



# చలో విజయవాడ'కు అనుమతులు లేవు

## ఎస్పీ పంకజ్ కుమార్ మీనా




**మార్కాపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 26**

స్వర్ణ గ్రామం-స్వర్ణ వార్డు కార్యక్రమంపై సచివాలయ ఉద్యోగులు తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి ఎలాంటి అనుమతులు లేవని మార్కాపురం జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అనుమతులు లేని కార్యక్రమాల్లో ఉద్యోగులు పాల్గొనవద్దని సూచించారు. అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు శాఖకు సహకరించాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చట్టపరమైన నిబంధనలు పాటించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు నియమ నిబంధనలను పాటించకపోతే చర్యలు తప్పవు

### పొదిలి సి ఐ రాజేష్



**పొదిలి, పెన్ పవర్, సెప్టెంబర్ 26**

వాహనదారులు రోడ్డు నియమ నిబంధనను పాటించకపోతే అటువంటి వారిపై చర్యలు తప్పవని పొదిలి పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం రాజేష్ హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆయన స్థానిక పెద్ద బస్టాండ్ సెంటర్ లో రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ రాజేష్ మాట్లాడుతూ నేరంతో పాటు ఎంతో ప్రమాదకరమన్నారు. అలాగే వాహనాలు నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ల వినియోగం కూడా ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలను వాహనదారులు కచ్చితంగా పాటించాల్సి ఉందని, అందుకు వ్యతిరేకంగా ఎవరు వ్యవహరించినా చర్యలు తీసుకోవడంలో వెనుకాడది లేదని సీఐ రాజేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ టివి సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయుడు రసూల్ తల్లికి నివాళులు అర్పించిన ముత్తుముల క్రిష్ణ కిషోర్



**గిద్దలూరు పెన్ పవర్ 26**

గిద్దలూరు పాత్రికేయుడు గా ఉన్న రసూల్ తల్లి అయిన ఫాతిమాబి (68) మరణించిన విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల క్రిష్ణ కిషోర్ రెడ్డి వారి నివాసం వద్దకు వెళ్లి ఫాతిమాబి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పాత్రికేయుడు కుటుంబ సభ్యులను పరామర్శించినారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సయ్యద్ షాహాన్ షా వలి, దుత్తా బాల ఈశ్వరయ్య, లొక్కు రమేష్, మండ్ల శ్రీనివాసులు, పెద్ద వలి , వేములపాటి చంటి, ప్రభాకర్, మాభు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## మాలకొండ ఆదాయం రూ 11,12,471

**వలేటివారిపాలెం, పెన్ పవర్ సెప్టెంబర్ 26**

అయ్యవారి పల్లి పంచాయతీ పరిధిలోని మాలకొండ లో వెలిసియున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారికి శనివారం భక్తుల నుండి వివిధ రూపాల ద్వారా రూ 11,12,471 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి శ్రీనివాసులు రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకులు గౌరి శంకర్, నృసింహ చార్యులు స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## షాట్‌పుట్‌లో రజతం సాధించిన తేజిందర్‌పాల్ సింగ్: గుల్వీర్-యూనస్ 1500m ఫైనల్‌కు!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా క్రీడలలో భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శనలతో పతకాల పంట పండిస్తున్నారు. తాజాగా ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లలో భారత్ మరోసారి తన సత్తా చాటింది. షాట్‌పుట్ విభాగంలో తేజిందర్‌పాల్ సింగ్ తూర్ రజత పతకం సాధించగా, స్ప్రింటర్ అనిమేష్ కుజుర్ 200 మీటర్ల ఫైనల్‌కు దూసుకెళ్లారు. అలాగే మిడిల్ డిస్టెన్స్ రన్నర్లు కూడా పతకం రేసులోకి దూసుకెళ్లారు.

**షాట్‌పుట్‌లో తేజిందర్‌పాల్ సింగ్ రజతం:**

పురుషుల షాట్‌పుట్ ఫైనల్‌లో భారత స్టార్ అథ్లెట్ తేజిందర్‌పాల్ సింగ్ తూర్ అద్భుత ప్రదర్శన కనబరిచారు. తన ఐదో ప్రయత్నంలో 20.64 మీటర్ల దూరం విసిరి రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఇరాన్‌కు చెందిన మొహమ్మద్‌రెజా తయేబిసే 20.81 మీటర్ల గేమ్స్ రికార్డు త్రోతో స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నారు. గతంలో 2018 జకార్తా, 2022 హాంగ్జౌ ఏషియన్ గేమ్స్‌లో వరుసగా స్వర్ణాలు గెలిచిన తూర్.. తాజాగా ఐచి-నగోయా గేమ్స్‌లో రజతం సాధించి ఆసియా వేదికపై తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకున్నాడు.

**1500 మీటర్లలో గుల్వీర్, యూనూస్ దూకుడు:**

పురుషుల 200 మీటర్ల సెమీఫైనల్-3లో భారత స్ప్రింటర్ అనిమేష్ కుజుర్ 20.81 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని రెండో స్థానంలో నిలవడంతో, ఫైనల్‌కు అర్హత సాధించారు. థాయ్‌లాండ్‌కు చెందిన పురిపోల్ బూన్సన్ 20.10 సెకన్లతో గేమ్స్ రికార్డు సృష్టించారు. అంతకుముందు 100 మీటర్ల ఫైనల్ రేసును కోల్పోయిన అనిమేష్, 200 మీటర్లలో అద్భుతమైన కంబ్యాక్ ఇచ్చి పతక రేసులో నిలిచారు. ఇక పురుషుల 1500 మీటర్ల ఈవెంట్‌లో భారత్‌కు మరో శుభవార్త అందగా.. హీట్-2లో గుల్వీర్ సింగ్ (3:45.79), హీట్-1లో యూనూస్ షా (3:45.77) తమ విభాగాల్లో మూడో స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. ఎల్లుండి (సోమవారం, సెప్టెంబర్ 28) ఈ పతక పోరు జరగనుంది.

**కబడ్డీలోనూ గోల్డ్ మెడల్:**

ఇదిలా ఉండగా, ఈరోజు (సెప్టెంబర్ 26, శనివారం) జరిగిన పురుషుల కబడ్డీ ఫైనల్‌లో ఇరాన్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో భారత్ అద్భుతమైన కంబ్యాక్‌తో 39--34 తేడాతో గెలిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. తొలి అర్ధభాగంలో 17--18తో వెనుకబడినప్పటికీ, ఆ తర్వాత చెలరేగిపోయి భారత్ గోల్డ్ మెడల్‌ను సొంతం చేసుకుంది.

# తిరువనంతపురంలో రోహిత్ ఫ్యాన్స్ రచ్చ.. గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం బయట 50 అడుగుల కటౌట్!







**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ వర్సెస్ వెస్టిండీస్ తొలి వన్డే మ్యాచ్‌కు వేదికైన కేరళలోని తిరువనంతపురంలో క్రికెట్ ఫీవర్ తారాస్థాయికి చేరుకుంది. గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియం పరిసరాలు ప్రస్తుతం క్రికెట్ అభిమానుల కోలాహలంతో పండగ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. రేపు (సెప్టెంబర్ 27, ఆదివారం) జరగనున్న ఈ హైవోల్టేజ్ పోరు కోసం కేరళ ఫ్యాన్స్ ఘన స్వాగతం పలుకుతున్నారు. ముఖ్యంగా టీమిండియా స్టార్ ఓపెనర్, రోహిత్ శర్మపై తమ అభిమానాన్ని చాటుకుంటూ ఫ్యాన్స్ ఏర్పాటు చేసిన భారీ కటౌట్ ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**రోహిత్ శర్మ 50 అడుగుల కటౌట్:**

ఇండియా వర్సెస్ విండీస్ మ్యాచ్ నేపథ్యంలో ఆల్ కేరళ రోహిత్ శర్మ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టేడియం బయట ఏకంగా 50 అడుగుల భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. అయితే కేరళ గడ్డపై రోహిత్ కు ఉన్న క్రేజ్ ఏపాటిదో ఈ కటౌట్ తో మరోసారి నిరూపించింది. తిరువనంతపురానికి తరలివస్తున్న క్రికెట్ లవర్స్, అభిమానులు ఈ భారీ కటౌట్ ఎదుట ఆగి

పండగ వాతావరణంలో గ్రీన్ ఫీల్డ్ స్టేడియం:

కేరళలో ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు జరిగినప్పుడల్లా అభిమానులు భారీ బ్యానర్లు, కటౌట్లతో తమ అభిమాత్వాన్ని చాటుకోవడం ఆనవాయితీగా వస్తోంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లాంటి దిగ్గజాలు తిరిగి వన్డే జట్టులోకి అడుగు పెడుతుండటంతో ఈ మ్యాచ్‌పై అంచనాలు తారాస్థాయికి చేరాయి. స్టేడియం బయట కనిపిస్తున్న ఈ కోలాహలం, అభిమానుల కేరింతలు మ్యాచ్‌లోని ఉత్సాహాన్ని మరింత పెంచుతున్నాయి. ఇరు జట్ల మధ్య రసవత్తర పోరుకు రంగం సిద్ధంకావడంతో తిరువనంతపురం క్రికెట్ మాయాజాలంలో మునిగిపోయింది.

# ఆసియా క్రీడలు: కబడ్డీలో భారత్ డబుల్ గోల్డ్.. ఇరాన్‌ను ఓడించి పురుషుల జట్టు స్వర్ణం కైవసం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా క్రీడల్లో భారత కబడ్డీ జట్లు స్వర్ణ పతకాలతో మెరిశాయి. నేడు జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్స్‌లో పురుషుల, మహిళల జట్లు రెండూ ఇరాన్‌ను ఓడించి తమ టైటిళ్లను విజయవంతంగా నిలబెట్టుకున్నాయి. దీంతో భారత కబడ్డీ ఒకే రోజు రెండు స్వర్ణాలను ఖాతాలో వేసుకుని సంబరాలు చేసుకుంది. పురుషుల ఫైనల్ ఆద్యంతం హోరాహోరీగా సాగింది. భారత జట్టు 40-34 తేడాతో ఇరాన్‌పై విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఒక దశలో ఇరు జట్ల స్కోర్లు 20-20తో సమంగా నిలిచాయంటే పోరు ఎంత తీవ్రంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. అయితే, కీలక సమయంలో పుంజుకున్న భారత క్రీడాకారులు ఇరాన్‌పై పైచేయి సాధించి విజయాన్ని అందుకున్నారు. వరుసగా ఏడుసార్లు స్వర్ణాలు గెలిచిన భారత పురుషుల జట్టు, 2018 జకార్తా గేమ్స్‌లో ఇరాన్ చేతిలో ఓడి నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. అయితే, ఆ తర్వాత పుంజుకుని 2023లో టైటిల్ గెలిచి, ఇప్పుడు దాన్ని నిలబెట్టుకుని మరోసారి తమ ఆధిపత్యాన్ని నిరూపించుకుంది. అంతకుముందు జరిగిన మహిళల ఫైనల్‌లో కూడా భారత జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఇరాన్‌పై 37-34 తేడాతో గెలిచి స్వర్ణం కైవసం చేసుకుంది. దీంతో రెండు విభాగాల్లోనూ ఇరాన్‌ను ఓడించి భారత్ డబుల్ గోల్డ్ సాధించినట్టయింది.




# నచ్చకపోయినా కొన్నిసార్లు రాజీ పడక తప్పదు!

గ్లామర్ ప్రపంచంలో వెలిగిపోయే తారల జీవితాలు బయట నుంచి రంగులమయంగా కనిపించినా? దాని వెనుక అనేక ఆర్థిక సవాళ్లు, వృత్తిపరమైన రాజీలు దాగి ఉంటాయనేది పచ్చి నిజం. మనకు నచ్చకపోయినా కొన్నిసార్లు పరిస్థితిని బట్టి రాజీ పడక తప్పదు అంటూ బాలీవుడ్ నటి ఫాతిమా సనా షేక్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. తెరపై ఎన్ని వైవిధ్యమైన పాత్రలు పోషించినా? సినీ పరిశ్రమలోని ఆర్థిక వాస్తవాలు, పరిమితుల వల్ల నటీనటులు ఏమాత్రం ఇష్టం లేని ప్రాజెక్టులను కూడా చేయాల్సి వస్తుందని నిర్మొహమాటంగా వెల్లడించారు.

తమకంటూ సొంత ప్రాధాన్యతలు, కళాత్మక అభిరుచులు ఉన్నప్పటికీ జీవనోపాధి కోసమే నచ్చని పాత్రలను అంగీకరించాల్సి వస్తుందని ఫాతిమా ఓపెన్‌గా చెప్పారు. -మేము సంపన్న కుటుంబాల నుంచి రాలేదు. ప్రతి ఒక్కరికీ డబ్బు అవసరం ఉంటుంది. కేవలం నటులమే తప్ప సినిమాలకు కోట్లు ఖర్చుపెట్టే నిర్మాతులం కాదు- అంటూ సినీ రంగానికి సంబంధించిన ఆర్థిక చేదు నిజాలను బయటపెట్టారు. చేతిలో ఉన్న తక్కువ





అవకాశాల్లోనే ఉత్తమమైనదాన్ని ఎంచుకుంటూ ముందడుగు వేయక తప్పదని, పరిశ్రమలో టైమింగ్ వరుస విజయాలే అవకాశాల సంఖ్యను నిర్ణయిస్తాయన్నారు. హిందీ చిత్ర పరిశ్రమలో మహిళా నటీమణులకు లభించే పాత్రల పరిమితుల గురించి కూడా ఫాతిమా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పురుష నటులకు నటనలోని పూర్తి స్థాయి నైపుణ్యాన్ని చూపించడానికి అనేక అవకాశాలు దక్కుతాయని, కానీ మహిళల విషయానికి వచ్చేసరికి లోతైన, విభిన్నమైన కోణాలున్న పాత్రలు చాలా అరుదుగా లభిస్తాయన్నారు. సినిమా అనేది సమాజానికి ప్రతిబింబమని పేర్కొంటూ సమాజంలో ఉన్నట్లే సినిమాల్లోనూ లింగ ఆధారిత పాత్రల పరిమితులు స్పష్టంగా ఉంటాయని విశ్లేషించారు.

సినిమాల్లో మహిళా పాత్రలను చిత్రీకరించే తీరుపై మాట్లాడిన ఫాతిమా నెగెటివ్ లేదా కాంప్లెక్స్ ఛాయలున్న పాత్రల విషయంలో పరిశ్రమ ఇంకా పాత మూస ధోరణుల్లోనే ఉండిపోయిందని అభిప్రాయపడ్డారు. పురుషులకు లభించినట్లుగా సంక్లిష్టమైన, గందరగోళంతో కూడిన సాధారణ మహిళా పాత్రలను హుందాగా చూపించే స్థాయికి బాలీవుడ్ ఇంకా చేరుకోలేదన్నారు. నలుపు-తెలుపుల మధ్య ఉండే సాధారణ మానవ స్వభావాన్ని మహిళా పాత్రల్లో ఆవిష్కరించే ప్రయత్నాలు మరింత ఎక్కువగా జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫాతిమా షనా షేక్ తాజా ప్రాజెక్టు విషయానికి వస్తే జియోహాట్‌స్టార్‌లో ప్రసారమవుతున్న -హుంకార్-వెబ్ సిరీస్‌లో ఫాతిమా ఏసీపీ జస్లీన్ సింగ్ సోయిన్ అనే పవర్‌ఫుల్ పోలీసు ఆఫీసర్‌గా నటించారు. ఒక ఆధ్యాత్మిక గురువుపై పాఠశాల విద్యార్థిని చేసే లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో సిరీస్ కథాంశం సాగుతుంది. ఈ కేసును నిర్భయంగా దర్యాప్తు చేసే పోలీస్ అధికారిగా ఫాతిమా నటనకు విశేష ప్రశంసలు దక్కుతున్నాయి.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com